మహా న్యూస్

www.mahinewsindia.com

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక

వివరాలు కావలెను

మహా న్యూస్

తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహా న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగే ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగే ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

-: సంప్రదించండి :-

9059585898

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. | సంపుటి : 02 | సంచిక : 188 | ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య | పేజీలు : 8 | వెల రూ. 2 | గురువారం -08 - అక్టోబర్ - 2026

Published From :YSR Kadapa circulated by Kurnool I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana



కుమార్తె పెళ్లికి తమిళనాడు సీఎం విజయ్‌ను ఆహ్వానించిన వైఎస్ షర్మిల

- తమిళనాడు సీఎం విజయ్‌తో ఏపీసీసీ చీఫ్ షర్మిల భేటీ
- భర్త అనిల్ కుమార్‌తో కలిసి సీఎంను కలిసిన షర్మిల
- కుమార్తె అంజలి రెడ్డి వివాహానికి విజయ్‌ను ఆహ్వానించిన దంపతులు
- వివాహ పత్రిక అందించి వేడుకకు రావాల్సిందిగా విజ్ఞప్తి

పాతికేళ్ల ప్రజా ప్రస్థానం..

ప్రధాని మోదీకి ఏపీ కేబినెట్ అభినందన తీర్మానం


25 ఏళ్ల ప్రజా ప్రస్థానాన్ని కొనియాడిన రాష్ట్ర మంత్రివర్గం

- ★ భారత్ ప్రతిష్ఠను ప్రపంచ వేదికపై పెంచారని ప్రశంస
- ★ దూరదృష్టి, సమర్థ పాలనతో దేశానికి దిశానిర్దేశం చేస్తున్నారని కితాబు
- ★ దేశసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్ష



అమరావతి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాతికేళ్ల ప్రజా ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిమండలి ఆయనకు ఘనంగా అభినందనలు తెలియజేసింది. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా దేశానికి స్ఫూర్తిదాయక నాయకత్వాన్ని అందిస్తున్నారని కొనియాడుతూ రాష్ట్ర కేబినెట్ ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించింది. అసాధారణ క్రమశిక్షణ, నిబద్ధత, గొప్ప దార్శనికతతో మోదీ దేశానికి విశిష్ట సేవలు అందిస్తున్నారని మంత్రివర్గం ప్రశంసించింది. తన దార్శనికత, స్పష్టమైన లక్ష్యాలు, సమర్థవంతమైన పాలనతో భారత్‌ను ప్రపంచపటంలో అత్యున్నత స్థానంలో నిలిపారని తీర్మానంలో పేర్కొంది. మౌలిక సదుపాయాలు, మిగతా 2 లో

రాయలసీమకు ఏం చేశారు? రూ.24,000 కోట్లు ఎక్కడ? చంద్రబాబుపై రోజా ఫైర్



- రాయలసీమలో కరవు, సాగునీటి సమస్యలపై ప్రభుత్వం విఫలమైందని రోజా విమర్శ
- కరవు, చంద్రబాబు కవలలుగా అభివర్ణన
- ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ప్రకటించాలని సవాల్

అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు,



తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ.. దర్శనానికి 12 గంటలు

- తిరుమల గిరులపై భక్తజన సందోహం
- టోకెన్లు లేకుండా వచ్చిన వారికి సర్వదర్శనానికి 12 గంటల సమయం
- భక్తులతో నిండిపోయిన 31 కంపార్ట్‌మెంట్లు
- మంగళవారం నాడు శ్రీవారి హుండీ ఆదాయం రూ. 5.33 కోట్లు



విష్ణువు చివరి అవతారమైన 'కల్కి'గా మోదీ కనిపిస్తున్నారు..

భూటాన్ ప్రధాని ఆసక్తికర వ్యాఖ్యలు

'వికసిత్ భారత్' అంటే 'వికసిత్ భూటాన్' కూడా అని వ్యాఖ్య

ప్రజా జీవితంలో మోదీ 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వ్యాఖ్యలు

ఢిల్లీ: భారత ప్రధాని నరేంద్ర మోదీపై భూటాన్ ప్రధాని షెరింగ్ టోబ్గే ప్రశంసల వర్షం కురిపించారు. మోదీని తనకు అన్నయ్యగా భావిస్తానని, ఆయనను విష్ణువు అవతారంగా కూడా చూస్తానని చెప్పారు. మోదీ 25 ఏళ్లుగా ప్రభుత్వ అధినేతగా మిగతా 2 లో


- ప్రధాని మోదీపై భూటాన్ ప్రధాని పీఎం టోబ్గే ప్రశంసల వర్షం
- గ్లోబల్ సౌత్ గొంతుకను ప్రపంచ వేదికపై వినిపించడంలో మోదీ కీలక పాత్ర పోషించారని వ్యాఖ్య
- 2019లోనే మోదీని విష్ణువు అవతారంగా పేర్కొన్న విషయాన్ని గుర్తు చేసుకున్న టోబ్గే

ఐదు లక్ష్యాలు నిర్దేశిస్తూ.. భారతీయులకు

సరికొత్త నినాదం ఇచ్చిన ప్రధాని మోదీ

'మనం సాధించగలం' అంటూ మోదీ నినాదం

- ప్రభుత్వాధినేతగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రధాని మోదీ
- 2047 నాటికి వికసిత భారత్‌తో పాటు ఐదు భారీ లక్ష్యాల ప్రకటన




ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజల్లో సరికొత్త స్ఫూర్తిని నింపుతూ "మనం సాధించగలం" అనే కొత్త నినాదాన్ని ఇచ్చారు. తాను ప్రభుత్వ అధినేతగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని, మిగతా 2 లో


నా లక్ష్యం 100 ఎఫ్ఐఆర్‌లు.. వాటిని మెడల్స్ గా భావిస్తా

తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌పై స్పందించిన రాహుల్ గాంధీ

- తనపై ఇప్పటికే 45 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయని వెల్లడి
- 'ఇండియా' కూటమి ఎంపీలతో ఖర్గే భోజన సమావేశం
- ఈసీపై పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయం
- భేటీ అనంతరం జంతర్ మంతర్‌లో నిరసనకు విపక్షాలు సిద్ధం



ఢిల్లీ: ఈసీ కార్యాలయం ముట్టడి నేపథ్యంతో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను తేలిగ్గా తీసుకున్న కాంగ్రెస్ అగ్రనేత, మిగతా 2 లో



త్వరలో బీజేపీలో కీలక పదవి అంటూ ప్రచారం.. బండి సంజయ్ నోట ఆసక్తికర మాటలు!

- బీజేపీ తనకు ఎన్నో అవకాశాలు ఇచ్చిందన్న కేంద్ర మంత్రి
- ఏ బాధ్యత అప్పగించినా శిరసావహిస్తానని వ్యాఖ్య
- పదవుల కోసం పాకులాడే వ్యక్తి కాదని వెల్లడి
- కేసీఆర్ భూ వివాదాలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి డ్రామాలని విమర్శ
- 'ఓట్ చోరీ, సీట్ చోరీ' పేటెంట్ కాంగ్రెస్‌కే ఉందని ఆరోపణ

యాదాద్రి ప్లాంట్‌పై హరీశ్‌కు భట్టి సవాల్..

రూ.40,000 కోట్ల భారం ఎవరిదని ప్రశ్న!

గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై, మాజీ మంత్రి హరీశ్‌రావుపై విమర్శలు

- ★ బొగ్గు లింకేజీ లేకుండానే ప్లాంట్ కట్టి ప్రజలపై రూ.40,000 కోట్ల భారం మోపారని భట్టి ఆరోపణ
- ★ గరిష్ఠ డిమాండ్ ఉన్నా రాష్ట్రంలో కరెంట్ కోతలు లేవని వెల్లడి
- ★ జెన్‌కో, ట్రాన్స్‌కోల ప్రైవేటీకరణ వార్తలను ఖండించిన డిప్యూటీ సీఎం



హైదరాబాద్: తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై, మాజీ మంత్రి హరీశ్‌రావుపై విమర్శలు గుప్పించారు. బొగ్గు సరఫరాకు సరైన ఏర్పాట్లు చేయకుండానే ప్లాంట్‌ను నిర్మించి రాష్ట్ర ప్రజలపై రూ.40,000 కోట్ల భారం మోపారని ఆరోపించారు. ఈ తప్పిదాలకు ఎవరు బాధ్యత వహించాలని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఎల్ నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో విద్యుత్ గరిష్ఠ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరిందని తెలిపారు. ఇంతటి డిమాండ్ ఉన్నప్పటికీ, ప్రభుత్వం మిగతా 2 లో

ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం దసరా కానుక.. రెండు డీఏలు విడుదల



- ఉద్యోగులకు రెండు పెండింగ్ డీఏలు మంజూరు చేసిన తెలంగాణ ప్రభుత్వం
- మొత్తం 6.37 శాతం పెరగనున్న కరువు భత్యం
- అక్టోబర్ జీతంతో కలిపి పెరిగిన డీఏ చెల్లింపు
- ప్రభుత్వంపై ఏటా రూ. 2,500 కోట్ల అదనపు భారం

హైదరాబాద్: దసరా పండుగ ముందు తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది.

ఐదు లక్ష్యాలు నిర్దేశిస్తూ.. భారతీయులకు

సరికొత్త నినాదం ఇచ్చిన ప్రధాని మోదీ

ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజల్లో సరికొత్త స్ఫూర్తిని నింపుతూ "మనం సాధించగలం" అనే కొత్త నినాదాన్ని ఇచ్చారు. తాను ప్రభుత్వ అధినేతగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని, బుధవారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా దేశం ముందు ఐదు భారీ లక్ష్యాలను ఉంచి, వాటిని సాధించి తీరాలని పిలుపునిచ్చారు. సరిగ్గా పాతికేళ్ల క్రితం, 2001 అక్టోబర్ 7న నరేంద్ర మోదీ తొలిసారిగా గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. కేశూభాయ్ పటేల్ తర్వాత రాష్ట్ర 14వ ముఖ్యమంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ ప్రత్యేకమైన రోజును కేవలం జ్ఞాపకాలకే పరిమితం చేయకుండా, దేశం కోసం కొత్త సంకల్పం తీసుకునే రోజుగా ఆయన మలిచారు. "ఈ రోజు కేవలం గతాన్ని స్మరించుకునేది మాత్రమే కాదు, మన సంకల్పంలో కొత్త శక్తిని నింపే రోజు. మనం ఏదైనా సాధించగలమనే వాగ్దానాన్ని పునరుద్ఘాటించే రోజు" అని మోదీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా, 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యంతో పాటు మరో ఐదు కీలక లక్ష్యాలను ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల ముందుంచారు. అవి:

1. ప్రపంచంలోని మొదటి మూడు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్‌ను నిలపడం.
2. ఆత్మనిర్భర్ భారత్ (స్వయం సమృద్ధి) సాధించడం.
3. భారత్‌ను ప్రపంచ తయారీ కేంద్రంగా (గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్) తీర్చిదిద్దడం.
4. ఒలింపిక్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడం.
5. అంతరిక్షంలోకి మానవసహిత యాత్రను చేపట్టడం.

ప్రధాని మోదీ ఒక్కో లక్ష్యాన్ని ప్రకటిస్తున్నప్పుడు, స్టేడియంలోని వేలాది మంది ప్రజలు "మనం సాధించగలం" అంటూ మిన్నంటేలా నినదించారు. ఈ ఉత్సాహం, ఆత్మవిశ్వాసం అసాధారణమైనవని ప్రధాని ప్రశంసించారు.

సంక్షోభాలను ఎదుర్కొని నిలిచాం

గతంలో సంక్షోభాలు తలెత్తినప్పుడు భారత ఆర్థిక వ్యవస్థ కుదేలయ్యేదని, కానీ నేడు సంక్షోభ సమయాల్లో భారత్ చూపుతున్న పటిష్ఠత, స్థితిస్థాపకత గురించి ప్రపంచం చర్చించుకుంటోందని మోదీ అన్నారు. "ఒకప్పుడు దేశంలో విధానపరమైన స్తబ్ధత (పాలసీ పారాలిసిస్) గురించి చర్చ జరిగేది. నేడు సంస్కరణల ఎక్స్‌ప్రెస్ గురించి మాట్లాడుకుంటున్నారు" అంటూ అప్పటి యూపీఏ-2 ప్రభుత్వాన్ని ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు. చిన్న లక్ష్యాలు పెట్టుకోవడం దేశ సామర్థ్యాన్ని తక్కువ చేయడమేనని, అందుకే భారీ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ లక్ష్యాలన్నీ 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకేనని మోదీ స్పష్టం చేశారు.


సవాళ్ల నడుమ స్ఫూర్తి నింపే ప్రయత్నం

ప్రతిపక్షాల నుంచి విమర్శలు, నిరసనలు ఎదురవుతున్న తరుణంలో, ఈ కార్యక్రమం ద్వారా పార్టీ శ్రేణుల్లో, మద్దతుదారుల్లో మోదీ ఆత్మవిశ్వాసం నింపే ప్రయత్నం చేశారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) విషయంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ సాగుతున్న నిరసనలు, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆరోపణలు, యూజీసీ మార్గదర్శకాలపై వ్యతిరేకత వంటి సవాళ్లను ప్రభుత్వం ఎదుర్కొంటోన్న నేపథ్యంలో, ప్రధాని ప్రసంగం బీజేపీ శ్రేణుల్లో కొత్త ఉత్తేజాన్ని నింపింది.

అందుకు దేశ ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా: ప్రధాని మోదీ

ఢిల్లీ: ప్రభుత్వాధినేతగా తాను నిరంతరాయంగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకమే తనకు అతిపెద్ద బాధ్యత అని, తనపై ఈ దేశంలోని ప్రతి పౌరుడికీ గొప్ప హక్కు ఉందని ఆయన అన్నారు. నేడు ఢిల్లీలో జరిగిన 'వికసిత్ భారత్ సంకల్ప్ సభ'లో పాల్గొన్న మోదీ, ఈ చారిత్రక మైలురాయి సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రధాని మోదీకి ప్రజలు ఘన స్వాగతం పలికారు. పూలు చల్లుతూ, బీజేపీ జెండాలు ఊపుతూ 'భారత్ మాతా కీ జై', 'స్వాగత్ హై భాయ్ స్వాగత్ హై, మోదీజీ కా స్వాగత్ హై' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. చాలామంది ఈ దృశ్యాలను తమ ఫోన్లలో బంధించేందుకు ఉత్సాహం చూపారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు, ఎప్పటికైనా ఈ మైలురాయిని చేరుకుంటానని అస్సలు ఊహించలేదు. ఇది ప్రజల నిరంతర ఆశీర్వాదానికి నిదర్శనం. ప్రజాస్వామ్యంపై అపారమైన విశ్వాసం ఉన్న భారతీయ జనతా పార్టీ, ఎన్డీఏ, ఇతర రాజకీయ సహచరులందరికీ నా కృతజ్ఞతలు. దేశ ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. అసెంబ్లీ లేదా లోక్‌సభ ఎన్నికలు ఏవైనా, గత 25 ఏళ్లుగా ప్రజలు నన్ను తమ సేవకుడిగా ఎంచుకున్నారు" అని తెలిపారు. "నాకు ప్రజలే దైవ స్వరూపం. లక్షలాది మంది దేశప్రజల నమ్మకం, కార్యకర్తల కష్టమే నాకు ఎప్పటికీ అతిపెద్ద బలం. ఈ దేశం నాకు ఎంతో ఇచ్చింది. అందుకే దేశం పట్ల నా బాధ్యత కూడా అతిపెద్దది. నాపై ఈ దేశంలోని ప్రతి పౌరుడికీ గొప్ప హక్కు ఉందని నేను మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను" అని మోదీ భావోద్వేగంగా ప్రసంగించారు. ఈ 25 ఏళ్ల ప్రస్థానం పూర్తయిన సందర్భంగా ఈరోజు ఉదయం ఢిల్లీలోని సరోజినీ నగర్‌లో ఉన్న శ్రీ వినాయక మందిరాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న తన కుటుంబ సభ్యుల (ప్రజల) సంతోషం, శ్రేయస్సు, ఆరోగ్యం కోసం ప్రార్థించినట్లు ఆయన వివరించారు. 2001 అక్టోబర్ 7న కేశూభాయ్ పటేల్ స్థానంలో నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. వినాశకరమైన భూజ్ భూకంపం అనంతర పరిణామాలు, రాజకీయ, పరిపాలనాపరమైన సవాళ్లతో రాష్ట్రం సతమతమవుతున్న క్లిష్ట సమయంలో ఆయన ఆ పదవిని అలంకరించారు. 2014 వరకు ముఖ్యమంత్రిగా కొనసాగి, ఆ తర్వాత జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించి మూడుసార్లు ప్రధానమంత్రిగా ఎన్నికయ్యారు. ప్రధానమంత్రిగా మోదీ హయాంలో అంతర్జాతీయంగా భారత్‌కు గుర్తింపు గణనీయంగా పెరిగింది. ప్రభుత్వం దౌత్యపరమైన సంబంధాలను బలోపేతం చేయడం, ప్రపంచంలోని ప్రధాన దేశాలతో స్నేహపూర్వక సంబంధాలను కొనసాగించడం, 'గ్లోబల్ సౌత్' దేశాలకు భారత్‌ను కీలక గొంతుకగా నిలబెట్టడంలో ప్రత్యేక చొరవ తీసుకుంది.

12 అజెండా అంశాలకు ఆమోదం తెలిపిన ఏపీ కేబినెట్



అమరావతి: ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానాన్ని అభినందిస్తూ ఏపీ కేబినెట్ ప్రత్యేక తీర్మానం ఆమోదించిందని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. 'తల్లికి వందనం'కు రూ.10,208 కోట్లు కేటాయించి 68.05 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి కల్పించడంతో పాటు.. వసతి గృహాలు, గురుకులాల డైట్ ఛార్జీలను 10 శాతం పెంచినట్లు చెప్పారు. విదేశీ, ప్రైవేట్ వర్సిటీలను ఆకర్షించే ఉన్నత విద్యా విధానం-2026, గిరిజన విద్యార్థులకు ఐఐటీ-జేఈఈ, నీట్ కోచింగ్ సెంటర్, రేపల్లె ఆస్పత్రి విస్తరణ వంటి కీలక నిర్ణయాలకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. విధి నిర్వహణలో మృతిచెందిన ఆశా కార్యకర్తలకు రూ.1.50 లక్షల వరకు గ్రాట్యుటీ, కొండేపిలో గురుకులానికి 7 ఎకరాలు, ఆలయాభివృద్ధికి 7.66 ఎకరాల కేటాయింపుతో పాటు పేదల ఇళ్ల స్థలాల సమస్యల పరిష్కారానికి మంత్రుల సబ్‌కమిటీ ఏర్పాటు చేసినట్లు పార్థసారథి తెలిపారు.

కేబినెట్ భేటీలో 12 అంశాలకు ఆమోదం..

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన దాదాపు 3 గంటల పాటు సాగిన కేబినెట్ భేటీలో 12 అజెండా అంశాలకు ఆమోదం తెలిపారు. హార్టికల్చర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ కోసం రూ.20.62 కోట్ల ప్రాజెక్టుకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. విశాఖ మరికవలసలో గిరిజన విద్యార్థుల కోసం xxx-జీజుజు, చీజుజు కోచింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. కేబినెట్ భేటీకి మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి, సత్యకుమార్ యాదవ్, కందుల దుర్గేష్ గైర్హాజరయ్యారు. కేబినెట్ భేటీ అనంతరం రాజధాని భూముల అంశంపై మంత్రి నారాయణకు సీఎం పలు సూచనలు చేశారు. కేటగిరీ-4, ఎండోమెంట్ భూముల అంశంపై చర్చించారు. భూములకు సంబంధించిన న్యాయపరమైన అంశాలను పరిశీలించిన తర్వాత మరోసారి తన దృష్టికి తీసుకురావాలని సీఎం తెలిపారు.

నిబద్ధతతో పనిచేస్తే నామినేటెడ్ పదవి

150 మంది కార్యకర్తలకు అవకాశం

తెదేపా వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి లోకేశ్ వెల్లడి

అమరావతి: పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన నాయకులు, కార్యకర్తలు కొందర్ని ఎవరి సిఫారసు అవసరం లేకుండా నేరుగా నామినేటెడ్ పదవులకు ఎంపిక చేయనున్నట్లు తెదేపా వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. 2024 ఎన్నికలకు ముందు నుంచి పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఆరు కార్యక్రమాల్లో పనితీరును ప్రామాణికంగా తీసుకుని పదవులకు ఎంపిక చేస్తామన్నారు. మొత్తం ఆరు కార్యక్రమాల్లోనూ అత్యుత్తమ పనితీరు కనబరిచి, అవార్డులు అందుకున్నవారికి తొలి ప్రాధాన్యమిస్తామని చెప్పారు. ఆ తర్వాత ఐదు, నాలుగు కార్యక్రమాల్లో అవార్డులు సాధించినవారికి అవకాశమిస్తామన్నారు. మంగళవారం ఉండవల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. 'పార్టీ ఇచ్చిన కార్యక్రమాల్లో నిబద్ధతతో పాల్గొన్నవారిని గుర్తించి.. వారి స్థాయిని, సామర్థ్యాన్ని బట్టి రాష్ట్ర, జిల్లా స్థాయి నామినేటెడ్ పదవుల్లో నియమిస్తాం. ఈ ప్రతిపాదనకు పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ఆమోదం తెలిపారు. పదవుల కోసం సుమారు 150 మందిని ప్రాథమికంగా గుర్తించాం' అని వివరించారు.

కార్యకర్తలను పట్టించుకోని ఎమ్మెల్యేలకు హెచ్చరిక

కార్యకర్తలకు మొదటి నుంచీ తెదేపా పెద్దపీట వేస్తోందని, అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నామని లోకేశ్ తెలిపారు. వారి సంక్షేమానికి ఇప్పటి వరకు రూ.200 కోట్లు ఖర్చు చేశామన్నారు. 'ఎమ్మెల్యేలు నిరంతరం కార్యకర్తలతో మాట్లాడుతూ, వారికి అందుబాటులో ఉండాలని చెబుతున్నాం. మాట వినినివారిని గట్టిగానే హెచ్చరిస్తున్నాం. కూటమి పార్టీలు విస్తృత సమన్వయంలో పనిచేస్తున్నాయి. ఎక్కడైనా చిన్న చిన్న సమస్యలున్నా సర్దుబాటు చేసుకుంటూ ముందుకెళ్తాం. పార్టీ స్థాపించి నాలుగు దశాబ్దాలు దాటినా ఇంకా అన్ని జిల్లాల్లో కార్యాలయాల్లేవు. ప్రస్తుతం వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. భవిష్యత్తులో నియోజకవర్గ స్థాయిలోనూ పార్టీ కార్యాలయాలు నిర్మిస్తాం. ముఖ్యమంత్రి, నేను కార్యకర్తలతో నిర్వహిస్తున్న సమావేశాలు వచ్చే డిసెంబరు నాటికి 175 నియోజకవర్గాల్లోనూ పూర్తవుతాయి. తర్వాత రెండో దఫా సమావేశాలు ప్రారంభిస్తాం. ఇటీవల నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశం 40 రోజుల కార్యక్రమంగా చేశాం. భవిష్యత్తులో ఇంకా తక్కువ రోజుల్లోనే ఇంటింటికీ చేరాలన్న లక్ష్యంతో కార్యక్రమాలు రూపొందిస్తాం' అని లోకేశ్ వెల్లడించారు.

పాతికేళ్ల ప్రజా ప్రస్థానం..

ప్రధాని మోదీకి ఏపీ కేబినెట్ అభినందన తీర్మానం

అమరావతి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాతికేళ్ల ప్రజా ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిమండలి ఆయనకు ఘనంగా అభినందనలు తెలియజేసింది. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా దేశానికి స్ఫూర్తిదాయక నాయకత్వాన్ని అందిస్తున్నారని కొనియాడుతూ రాష్ట్ర కేబినెట్ ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించింది. అసాధారణ క్రమశిక్షణ, నిబద్ధత, గొప్ప దార్శనికతతో మోదీ దేశానికి విశిష్ట సేవలు అందిస్తున్నారని మంత్రివర్గం ప్రశంసించింది. తన దార్శనికత, స్పష్టమైన లక్ష్యాలు, సమర్థవంతమైన పాలనతో భారత్‌ను ప్రపంచపటంలో అత్యున్నత స్థానంలో నిలిపారని తీర్మానంలో పేర్కొంది. మౌలిక సదుపాయాలు, సాంకేతికత, సంక్షేమం, పారిశ్రామిక రంగాల్లో దేశాన్ని అభ్యుదయ పథంలో నడిపిస్తున్నారని మంత్రివర్గం స్పష్టం చేసింది. సృజనాత్మకతకు, నూతన ఆవిష్కరణలకు పెద్దపీట వేస్తూ పారదర్శకమైన, వేగవంతమైన పాలన అందిస్తున్నారని అభిప్రాయపడింది. సహకార సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రాలను భాగస్వాములుగా చేస్తూ దేశాన్ని సర్వతోముఖాభివృద్ధి వైపు నడిపిస్తున్నారని కొనియాడింది. అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రధాని మోదీ దేశానికి స్థిరమైన, పటిష్ఠమైన నాయకత్వాన్ని అందిస్తున్నారని కేబినెట్ వెల్లడించింది. సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటూనే, దేశ ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యమిచ్చి అంతర్జాతీయ వేదికలపై భారత్ గౌరవాన్ని ఇనుమడింపజేశారని ప్రశంసించింది. వ్యూహాత్మక భాగస్వామ్యాల ద్వారా ప్రపంచ దేశాలతో దౌత్య సంబంధాలను బలోపేతం చేయడంలో మోదీ కృషి అనిర్వచనీయమని అభిప్రాయపడింది. ఆధునిక, సాంకేతిక, స్వయం సమృద్ధి కలిగిన నవభారత నిర్మాణానికి ప్రధాని మోదీ చేస్తున్న కృషి ప్రశంసనీయమని ముఖ్యమంత్రి పేర్కొన్నట్లు తీర్మానం తెలిపింది. మోదీ దార్శనికత, రాజనీతిజ్ఞతతో భారత ప్రగతికి పటిష్ఠమైన పునాదులు పడ్డాయని ఏపీ మంత్రివర్గం అభిప్రాయపడింది. 21వ శతాబ్దం ప్రధాని మోదీ నాయకత్వానిదేనని, దేశసేవలో ఆయన మరిన్ని మైలురాళ్లను అధిగమించాలని ఆకాంక్షిస్తూ కేబినెట్ తన తీర్మానంలో పేర్కొంది.

నా లక్ష్యం 100 ఎఫ్ఐఆర్‌లు..

వాటిని మెడల్స్ గా భావిస్తా: రాహుల్ గాంధీ

ఢిల్లీ: ఈసీ కార్యాలయం ముట్టడి నేపథ్యంతో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను తేలిగ్గా తీసుకున్న కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, తన లక్ష్యం 100 ఎఫ్ఐఆర్‌లు అని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎన్ని ఎఫ్ఐఆర్ లు నమోదు చేసుకున్నా తానేమీ వెనుకంజ వేయబోనని, ఆ కేసులను మెడల్స్ గా భావిస్తానని అన్నారు. సీఈసీ పదవికి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందేనని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో నేడు జన్‌పథ్‌లోని సాగర్ రత్న రెస్టారెంట్‌లో విపక్ష ఎంపీల భోజన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారని, 'ఓట్ల దొంగతనం' అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ఇదే సమావేశంలో ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా మాట్లాడుతూ.. 'ఇది లంచ్ మాత్రమే కాదు, ఒక లాంచ్ కూడా కావచ్చు' అని చమత్కరించారు. కాగా, మంవారం 'ఓట్ల దొంగతనం' జరిగిందంటూ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిన్న విపక్ష ఎంపీలు ఎన్నికల సంఘం కార్యాలయానికి ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సహా పలువురు నేతలు ఆకాశవాణి భవన్‌లోకి ప్రవేశించి సుమారు 8 గంటల పాటు బైఠాయించారు. అనుమతి లేకుండా భవనంలోకి ప్రవేశించినందుకు పోలీసులు వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ ఎఫ్ఐఆర్‌పై స్పందిస్తూ రాహుల్ గాంధీ, "నాపై ఇప్పటికే 45 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయి. నా లక్ష్యం 100" అని తేలికగా వ్యాఖ్యానించారు. భోజన భేటీ అనంతరం, ఎంపీలందరూ జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపేందుకు సిద్ధంగా ఉన్న బస్సుల్లో బయలుదేరారు. మోదీ, అమిత్ షా, మోహన్ భగవత్, జ్ఞానేశ్ కుమార్ కలిసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు. ఈ పరిణామాల నేపథ్యంలో, పోలీసులు జంతర్ మంతర్, ఎన్నికల సంఘం కార్యాలయం వైపు వెళ్లే మార్గాల్లో భారీగా బారికేడ్లు ఏర్పాటు చేసి భద్రతను కట్టుదిట్టం చేశారు.

కుమార్తె పెళ్లికి తమిళనాడు సీఎం

విజయ్‌ను ఆహ్వానించిన వైఎస్ షర్మిల

అమరావతి: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. తన కుమార్తె వివాహ వేడుకకు ఆయన్ను ఆహ్వానించేందుకు షర్మిల తన భర్త అనిల్ కుమార్‌తో కలిసి నేడు చెన్నై వెళ్లారు. అక్కడ ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం విజయ్‌ను నేరుగా కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. వచ్చే నెల 25న తన కుమార్తె వైఎస్ అంజలి రెడ్డి వివాహం జరగనున్నట్లు షర్మిల తెలిపారు. ఈ వేడుకకు కుటుంబ సమేతంగా హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించాలని సీఎం విజయ్‌ను సాదరంగా కోరారు. ఈ సమావేశం అనంతరం షర్మిల సోషల్ మీడియా వేదికగా తన సంతోషాన్ని పంచుకున్నారు. తమకు సమయం కేటాయించిన సీఎం విజయ్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఆయన చూపిన ఆప్యాయత, అనురాగం ఎంతో ఆనందాన్ని కలిగించాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాబోయే దంపతులకు సీఎం విజయ్ తన శుభాకాంక్షలు తెలియజేసినట్లు వైఎస్ షర్మిల వివరించారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

విష్ణువు చివరి అవతారమైన 'కల్కి'గా మోదీ

కనిపిస్తున్నారు.. భూటాన్ ప్రధాని ఆసక్తికర వ్యాఖ్యలు

ఢిల్లీ: భారత ప్రధాని నరేంద్ర మోదీపై భూటాన్ ప్రధాని షెరింగ్ టోబ్గే ప్రశంసల వర్షం కురిపించారు. మోదీని తనకు అన్నయ్యగా భావిస్తానని, ఆయనను విష్ణువు అవతారంగా కూడా చూస్తానని చెప్పారు. మోదీ 25 ఏళ్లుగా ప్రభుత్వ అధినేతగా కొనసాగుతూ ప్రజా సేవ చేస్తున్న తీరును కొనియాడారు. మోదీ నాయకత్వంలో పొరుగు దేశాలతో సంబంధాలకు భారత్ ప్రాధాన్యం ఇస్తోందని టోబ్గే పేర్కొన్నారు. గ్లోబల్ సౌత్ దేశాల గొంతుకను ప్రపంచ వేదికపై బలంగా వినిపించడంలో మోదీ కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఆఫ్రికన్ యూనియన్‌ను జీ20లో శాశ్వత సభ్యుడిగా చేర్చడంలోనూ ఆయన కృషిని ప్రశంసించారు. మోదీతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న టోబ్గే.. ఆయనను చాలాకాలంగా అన్నయ్యగా భావిస్తున్నానని తెలిపారు. తర్వాత ఆయనను మార్గదర్శకుడిగా కూడా చూసినట్లు చెప్పారు. 2019లో మోదీని విష్ణువు అవతారంగా పేర్కొన్న విషయాన్ని గుర్తు చేసుకున్నారు. 2024లో ఢిల్లీలో మోదీని కలిసినప్పుడు తాను గతంలో చెప్పిన మాటల గురించి ఆలోచించానని, తాను తప్పుగా చెప్పలేదని తేల్చుకున్నానన్నారు. విష్ణువు చివరి అవతారమైన కల్కిగా మోదీ కనిపిస్తున్నారని టోబ్గే అన్నారు. అశాంతిని తొలగించి ధర్మాన్ని పునరుద్ధరించి కొత్త మార్పుకు నాంది పలికే అవతారమే కల్కి అని పేర్కొన్నారు. 'వికసిత్ భారత్' అంటే 'వికసిత్ భూటాన్' కూడా అని టోబ్గే వ్యాఖ్యానించారు. 2014లో ప్రధాని అయిన కొద్ది వారాల్లోనే మోదీ తన తొలి విదేశీ పర్యటనకు భూటాన్‌ను ఎంచుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఆ పర్యటనలో భారత్-భూటాన్ సంబంధాలను 'బీ4బీ'గా మోదీ అభివర్ణించారని తెలిపారు. అంటే 'భూటాన్ కోసం భారత్.. భారత్ కోసం భూటాన్' అని వివరించారు. భూటాన్ అభివృద్ధి ప్రణాళికలకు భారత్ అందిస్తున్న సహకారాన్ని టోబ్గే ప్రశంసించారు. 13వ పంచవర్ష ప్రణాళిక కోసం భారత్ అందించే సాయాన్ని మోదీ ప్రభుత్వం రూ.10 వేల కోట్లకు పెంచిందని చెప్పారు. విద్య, వైద్యం, మౌలిక వసతులు, జల విద్యుత్, సాంకేతికత, వ్యవసాయం, వ్యాపార రంగాల్లో ఇరు దేశాల సహకారం విస్తరించిందన్నారు. భూటాన్ రాజు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గెలెఫు మైండ్‌ఫుల్‌నెస్ సిటీ ప్రాజెక్టుకు భారత్ పూర్తి మద్దతు ఇస్తోందని తెలిపారు. రైలు మార్గాలు, సరిహద్దు మౌలిక వసతులు, విమాన, డిజిటల్ కనెక్టివిటీ అభివృద్ధి దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ..

దర్శనానికి 12 గంటలు

తిరుపతి: తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. బుధవారం ఉదయం నాటికి, శ్రీవారి దర్శనం కోసం 31 వైకుంఠం క్యూ కాంప్లెక్స్ కంపార్ట్‌మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులకు స్వామివారి దర్శనానికి సుమారు 12 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు. మంగళవారం (అక్టోబర్ 6) ఒక్కరోజే 73,629 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 27,525 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా శ్రీవారి హుండీ ఆదాయం రూ. 5.33 కోట్లుగా నమోదైంది. అదేవిధంగా, టీటీడీ నిన్న 3.91 లక్షల లడ్డూలను భక్తులకు విక్రయించింది. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద సత్రంలో 1.75 లక్షల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. తిరుమలలోని అశ్విని ఆసుపత్రిలో 3,334 మందికి వైద్య సేవలు అందించినట్లు అధికారులు తెలిపారు. భక్తుల రద్దీ నేపథ్యంలో టీటీడీ తగిన ఏర్పాట్లు చేస్తోంది.

రాయలసీమకు ఏం చేశారు?

రూ.24,000 కోట్లు ఎక్కడ?: చంద్రబాబుపై రోజా ఫైర్

అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి రోజా తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాయలసీమలో కరవు, సాగునీటి సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని, అభివృద్ధిపై కేవలం గొప్పలు చెబుతోందని ఆమె ఆరోపించారు. చిత్తూరులో మీడియాతో ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ మాటలకు, క్షేత్రస్థాయి వాస్తవాలకు పొంతన లేదన్నారు. "రాయలసీమపై ప్రేమ ఉందని చెబుతారు. కానీ ఈ ప్రాంతానికి ఏం చేశారు? రూ.24,000 కోట్లతో ప్రాజెక్టులు చేపట్టామని అంటున్నారు. అవి ఎక్కడున్నాయో ప్రజలకు చూపించండి" అని రోజా సవాల్ విసిరారు. ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ప్రకటించాలని డిమాండ్ చేశారు. కరవు, చంద్రబాబు కవలలని, ప్రస్తుత పాలనలో నీటి కొరత మరింత తీవ్రమైందని ఆమె వ్యాఖ్యానించారు. వైఎస్ రాజశేఖర రెడ్డి, జగన్ హయాంలో చేపట్టిన సాగునీటి, వ్యవసాయ చర్యల నుంచి ప్రభుత్వం పాఠాలు నేర్చుకోవాలని రోజా సూచించారు. 'రైజింగ్ రాయలసీమ' అంటూ నినాదాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, కొత్తగా ఎన్ని ఎకరాలకు సాగునీరు అందించారో అధికారిక లెక్కలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పోటీ పడుతున్నారని ఆమె ఆరోపించారు.

ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం దసరా కానుక..

రెండు డీఏలు విడుదల

హైదరాబాద్: దసరా పండుగ ముందు తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. పెండింగ్‌లో ఉన్న రెండు విడతల కరవు భత్యాన్ని (డీఏ) మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 1వ తేదీన జరిగిన మంత్రిమండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ప్రభుత్వం ఈ ఉత్తర్వులను వెలువరించింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, 2024 జనవరి 1 నుంచి డీఏ 33.67 శాతం నుంచి 37.31 శాతానికి, 2024 జులై 1 నుంచి 40.04 శాతానికి పెరగనుంది. దీంతో ఉద్యోగుల డీఏ మొత్తం 6.37 శాతం పెరిగినట్లయింది. పెరిగిన డీఏను అక్టోబరు

RNI : APTEL/25/A0108
మహా న్యూస్ www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com తెలుగు దినపత్రిక

తెలంగాణ ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం దిశగా

-పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి

వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): తెలంగాణ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే దిశగా సీఎం రేవెంత్ రెడ్డి సమక్షంలో మేమంతా పని చేస్తున్నామని ఎమ్మెల్యే టి.రాంమ్మోహన్ రెడ్డి అన్నారు. పరిగి ఆర్టీసీ డిపో సమీపంలో బుధవారం టీఎంయూ బలపరిచిన అభ్యర్థి అశ్వద్దామ రెడ్డికి పరిగి ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులకు మద్దత్తు ఇచ్చి బాణం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.రాంమ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ డిపోకు, సంస్థను తనకు ఎనలేని సంబంధం ఉందన్నారు. గతంలో తన ఎమ్మెల్యే నిధులతో డిపోలోప్లాట్ ఫాంలు నిర్మించి అభివృద్ధి కృషి చేశానన్నారు. ఆర్టీసీ ఆస్తులను కాపాడుతూ, డిపో అభివృద్ధికి కృషి చేస్తూ టీఎంయూ కు కాంగ్రెస్ ప్రభుత్వం మద్దత్తు ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిపో కార్యదర్శి విశ్వనాథ్ గౌడ్, అధ్యక్షుడు ఎస్ జే ఎం రెడ్డి, టి.నరేందర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ విజయానికి కృషి చేసిన వారికి అవార్డులు

66 వేలకు పైగా కేసుల పరిష్కారం

రాష్ట్రంలో కర్నూలు జిల్లాకు మూడో స్థానం

జడ్జిలు, న్యాయవాదులు, పోలీసులు, ఎక్సైజ్ అధికారులకు సత్కారం



కర్నూలు, అక్టోబర్ 7: (మహి న్యూస్) సెప్టెంబర్ 12న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 66 వేలకు పైగా కేసులు పరిష్కారం కావడంలో కృషి చేసిన జడ్జిలు, న్యాయవాదులు, పోలీసులు, ఎక్సైజ్ అధికారులకు అవార్డులు అందజేశారు. కర్నూలు జిల్లా న్యాయ సేవా సదన్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పి. వాసు, కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి ఆధ్వర్యంలో బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. లోక్ అదాలత్‌లో కర్నూలు జిల్లా రాష్ట్రంలో మూడో స్థానం సాధించడంపై కృషి చేసిన వారిని అభినందించారు. ఎక్కువ సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కరించిన న్యాయమూర్తులు అనూష, టి. భాస్కర్, ఎస్. జ్యోతి, కే. హేమ, వెంకట్రామిరెడ్డి, నూరుల్లాలకు అవార్డులు అందజేశారు. ఎక్కువ క్రిమినల్ కేసుల పరిష్కారంలో కృషి చేసిన కర్నూలు టౌన్ డీఎస్పీ వీర రాఘవేంద్ర, డోన్ డీఎస్పీ శ్రీనివాసులును సన్మానించారు. మోటార్ యాక్సిడెంట్ కేసుల పరిష్కారంలో కృషి చేసిన న్యాయవాది రామాంజనేయులుతో పాటు సీఐలు, ఎస్ఐలు, ఎక్సైజ్ పోలీసులు, కోర్టు కానిస్టేబుళ్లను కూడా అవార్డులతో సత్కరించారు. వచ్చే లోక్ అదాలత్‌లను కూడా విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. వాసు కోరారు.

దేవదాయ కమిషనర్ కు ఆహ్వానం



శ్రీశైలం, మహి న్యూస్, అక్టోబర్ 7 : శ్రీశైల మహాక్షేత్రంలో అక్టోబరు 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు దసరా మహోత్సవాలు ఎంతో వైభవంగా జరుగనున్నాయి ఈ సందర్భంగా దేవదాయశాఖ ప్రధాన కార్యాలయములో కమిషనరు కె. రామచంద్రమోహన్ కలిసి ఆహ్వానపత్రికను అందజేసి దసరా ఉత్సవాలకు ఆహ్వానించడం జరిగింది. శ్రీశైలదేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీపోతుగుంట రమేష్‌నాయుడు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు, అర్చకస్వాములు, వేదపండితులు అధికారులు దేవదాయ కమిషనరు వారిని కలిసి దసరా మహోత్సవాలకు ఆహ్వానించారు. ఈ కార్యక్రమములో వేదాశీర్వచనంతో శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేయడం జరిగింది.

ఢిల్లీలో కుప్పకూలిన 5 అంతస్తుల భవనం

న్యూఢిల్లీ: దేశ రాజధాని నగరం ఢిల్లీలో హాస్టల్ భవనం కుప్పకూలిన విషాదాన్ని మర్చిపోక ముందే మరో భవనం కూలిపోవడం కలకలం రేపింది. ఈశాన్య ఢిల్లీలోని సీమాపురి ప్రాంతంలో బుధవారం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కుప్పకూలిన ఐదు అంతస్తుల భవన శిథిలాల కింద పలువురు చిక్కుకుని ఉండవచ్చనే అందోళన మరింత దిగ్భ్రాంతి రేపుతోంది. ఐదు అంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలడంతో జనం హాహాకారాలు, తీవ్ర గందరగోళం నెలకొంది మధ్యాహ్నం 3.30 గంటలకు భవనం కూలి పోయినట్లు ఢిల్లీ అగ్నిమాపక విభాగానికి (డీఎఫ్ఎస్) సమాచారం అందింది. దీంతో వెంటనే వారు అప్రమత్తమయ్యారు. గాలింపు, ఇతర సహాయక చర్యలు కొనసాగుతున్నా యని అధికారి తెలిపారు. సత్య నికేతన్‌లోని హాస్టల్‌లో ఏడుగురు మృతి చెందగా, పలువురు గాయపడిన విషాదం ఘటన జరిగిన నెల రోజుల తర్వాత మరో ప్రమాదం పలువుర్ని విస్మయానికి గురి చేస్తోంది.ం

గడ్డి తిన్నవారే పార్టీని వీడారు.. బొత్స ఆగ్రహం



విజయనగరం: కొందరు తమ స్వార్థ ప్రయోజనాలతో వైఎస్సార్‌సీపీని వీడవచ్చని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. వైఎస్సార్‌సీపీలో ఉన్నప్పుడు కొందరిని విమర్శించిన టీడీపీ నేతలు.. ఇప్పుడు వారినే తమ పార్టీలోకి తీసుకుంటున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇదే సమయంలో వైఎస్సార్‌సీపీని వీడిన వారిని ఉద్దేశించి 'గడ్డి తిన్నవారే పార్టీ వీడారు' అంటూ మండిపడ్డారు. మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ తాజాగా మాట్లాడుతూ..'కొందరు తమ స్వార్థంతో పార్టీని వీడవచ్చు. గడ్డి తిన్నవారే పార్టీ వీడారు. వైఎస్సార్‌సీపీలో ఉన్న వాళ్లని బాలకృష్ణ, కళా వెంకటరావులు విమర్శించి ఇప్పుడు వారినే టీడీపీలోకి తీసుకున్నారు. ఇప్పుడు వాళ్లు పూనీతులు అయిపోయారా?. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అన్ని గ్రామాల్లో పోటీ చేయాలి. పుకార్లను నమ్మకుండా పార్టీ శ్రేణులు ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు. అన్ని స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. గ్రామాల్లో ఏకాభిప్రాయంతో పోటీ చేసే అభ్యర్థులను ఎంపిక చేసుకోవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. రెండేళ్లలో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుంది. అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతాయి. టీడీపీ ప్రభుత్వం పోలవరం ఎత్తు తగ్గించేశారు. అందువలన సుజల స్రవంతికి నీరు వచ్చే పరిస్థితి లేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తే ఎత్తిపోతల పథకంతో సాగునీరు ఇస్తాం. వైఎస్సార్‌సీపీ గుర్తింపు కార్డు ఉన్న

రిజిస్టేషన్ కోసం రోడ్డెక్కిన రైతులు

మా పట్టా భూములపై రెవెన్యూ అధికారుల పెత్తనమేంది..?

స్లాట్ బుక్ చేసినా రిజిస్టేషన్ చేయడం లేదంటూ రైతుల ఆవేధన

సయ్యద్ పల్లి గ్రామ రైతుల రాస్తారోఖో




వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): ఆపద ఉందని మా పట్టాభూమిని మేము అమ్ముకుందామని స్లాట్ బుక్ చేస్తే తీరా రిజిస్టేషన్ (తహసిల్దార్) కార్యాలయంలో రిజిస్టేషన్ చేయడం లేదంటూ సయ్యద్ పల్లి గ్రామ రైతులు రోడ్డెక్కారు. వికారాబాద్ జిల్లా పరిగి మండల సయ్యద్ పల్లి గ్రామ రైతులు బుధవారం పరిగి-షాద్ నగర్ రోడ్డుపై రాస్తా రోఖో నిర్వహించారు. ఈ సందర్భంగా సయ్యద్ పల్లి గ్రామ మాజీ సర్పంచ్ కోట్ల వెంకట్ రామకృష్ణ రెడ్డి, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ పల్లమోని వెంకటయ్య మాట్లాడుతూ తన భూమి సర్వేనెంబరు 127 లో 25 గుంటల భూమిని హైదరాబాద్ కు చెందిన షంషోద్దీన్ వద్ద 30 లక్షలు వడ్డీకి తీసుకొని భూమిని రిజిస్టేషన్ చేసి ఇచ్చాడు. ఇప్పుడు ఈ భూమిని ఇతరుకు అమ్మేందుకు ఈనెల 4వ తేదీన 42,289 రూపాయలు ఈ చాలన్ కట్టి స్లాట్ బుక్ చేసుకున్నారు. తీరా రిజిస్టేషన్ వెళ్లగా రెవెన్యూ అధికారులు సయ్యద్ పల్లి గ్రామ భూములు విక్రయాలు చేయరాదని ఉన్నతాధికారులు చెప్పారని అందుకే రిజిస్టేషన్ చేయడం లేదంటూ చెప్పగా మా సొంత సయ్యద్ పల్లిలోని మా పట్టా భూములు అమ్మడం, కొనడం చేయరాదంటూ ప్రభుత్వం నుంచి, కలెక్టర్ నుంచి ఏ మైనా లిఖిత పూర్వక ఆదేశాలున్నాయా అంటూ మూడు రోజులుగా ప్రశ్నిస్తుంటే తహసిల్దార్, ఆరీధఓలను ప్రశ్నిస్తున్నా మాట దాటేస్తున్నారే తప్ప స్పష్టమైన సమాధానం చెప్పడం లేదంటూ తప్పుపట్టారు. రెవెన్యూ అధికారుల తీరును సయ్యద్ పల్లి గ్రామ రైతులు అనుమానిస్తున్నారు. లక్ష్మీదేవి పల్లి ప్రాజెక్ట్ లో ఎకరాల భూమిని కోల్పోతున్నా జిల్లా సస్యశ్యామలమై సాగునీరు అందుతుదన్న ఉద్దేశంలో మా గ్రామ రైతులంమంతా ఒప్పుకున్నాము. కనీసం గ్రామంలో గ్రామంలో గ్రామ సభ పెట్టకుండా, ప్రాజెక్టులో భూములు తీసుకునే రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం, పాలకులు రెవెన్యూ అధికారులను అడ్డం పెట్టుకొని మా భూములు అవసరం నిమిత్తం అమ్ముకోకుండా అడ్డుపడటం నీచ సంస్కృతి అని మండిపడ్డారు. మా భూములు ప్రాజెక్టుకు తీసుకోవాలనుకుంటే రైతులకు గిట్టు బాట ధర కల్పించి కొనుగోలు చేయాలేతప్ప రైతుల ప్రమేయమే లేకుండా సయ్యద్ పల్లి గ్రామస్తులు ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి రైతులు తమ సొంత పట్టా భూములు ఆపదలో అమ్ముకునే వెసలుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రభుత్వమే రైతులకు గిట్టు బాట ధర కల్పించి కొనుగోలు చేయాలని సూచించారు. శాంతి యుతంగా ధర్నా, నిరసన చేపడుతుంటే పోలీసులు ఉసిగొల్పి కేసులు పెడతామని రైతులు భయభ్రాంతులకు గురిచేయడం కరెక్ట్ కాదన్నారు. అటు భూములు అమ్ముకోలేక, వడ్డీలు పెరిగి పోయి రైతులు ఇబ్బంది పడుతున్నారని సయ్యద్ పల్లి గ్రామ రైతులు ఆవేధన చెందుతున్నారు. నిరసన తెలుపుతున్న రైతులను పరిగి ఎస్ఐ మోహన్ కృష్ణ తన సిబ్బందితో వచ్చి రోడ్డుపై నిరసన తెలుపుతున్న రైతులను సముదాయించి రాస్తారోఖో నుంచి పక్కకు జరిపించి రాకపోకలకు వీలుగా రోడ్డుకు క్లియర్ చేశారు.

ప్రాణాల కంటే విలువైనది మరొకటి లేదు...

ప్రజల ప్రాణాల రక్షణే మా లక్ష్యం

- డాక్టర్ టి.రితిక్ రెడ్డి





వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): యువ నాయకులు, పి ఆర్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, టీపీసీసీ మెంబర్ డాక్టర్ టి. రితిక్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని, టి ఆర్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్



ఆధ్వర్యంలో పరిగి పట్టణంలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద హెల్మెట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పరిగి ఎమ్మెల్యే,టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ (ఎస్ ఐ ఆర్) డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి పాల్గొని స్థానిక నాయకులు ప్రజాప్రతినిధులతో కలిసి హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ టి. రితిక్ రెడ్డి మాట్లాడుతూ... "రోడ్డు ప్రమాదాలను నివారించడంలో ప్రతి ఒక్కరి బాధ్యత ఎంతో కీలకం. ప్రభుత్వం రోడ్ల అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చించి మెరుగైన రహదారులను నిర్మిస్తున్నా, మనం ట్రాఫిక్ నియమాలను పాటించకపోతే ప్రమాదాలను పూర్తిగా నివారించడం సాధ్యం కాదు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. అలాగే నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే వారు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలి. ఒక ప్రమాదం జరిగితే నష్టపోయేది ఒక్క వ్యక్తి మాత్రమే కాదు, ఆ కుటుంబం మొత్తం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అందుకే మన కుటుంబాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ భద్రతా నియమాలను పాటించాలి. ఈ అవగాహన కల్పించాలనే ఉద్దేశంతోనే మా జన్మదినం సందర్భంగా హెల్మెట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ప్రజల ప్రాణాల కంటే విలువైనది మరొకటి లేదు. ప్రతి ఒక్కరూ సురక్షితంగా ప్రయాణిస్తూ, ఇతరులకు కూడా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని కోరుతున్నాను. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు ఉన్న రహదారిపై గతంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఎంతోమంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ప్రభుత్వాలు మారినా ఆ రహదారి అభివృద్ధిని ఎవరూ పట్టించుకోలేదని అన్నారు. పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ప్రత్యేక కృషి, నిరంతర ప్రయత్నాల ఫలితంగా అప్పా జంక్షన్--మన్నెగూడ నాలుగు లైన్ల రహదారి పనులు ప్రస్తుతం వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. రహదారి విస్తరణ పూర్తయిన తర్వాత ప్రమాదాలు గణనీయంగా తగ్గడంతో పాటు, హైదరాబాద్‌కు ప్రయాణించే వేలాది మంది ప్రజలకు సురక్షితమైన, వేగవంతమైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా టి ఆర్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా నిరంతరం కొనసాగిస్తామని" తెలిపారు.

అన్ని ప్రభుత్వ పాఠశాలలకు స్మార్ట్ కిచెన్ విస్తరణ...!

జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

త్వరలో లక్ష మందికి పైగా

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం



కడప, మహి న్యూస్ అక్టోబర్ 7: విద్యార్థులకు పరిశుభ్రమైన, రుచికరమైన, పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని సకాలంలో అందిస్తున్న స్మార్ట్ కిచెన్ వ్యవస్థను జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు విస్తరించేందుకు చర్యలు వేగవంతం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. బుధవారం రాత్రి



కలెక్టరేట్‌లోని బోర్డు సమావేశ మందిరం నుంచి సంబంధిత శాఖల అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, స్మార్ట్ కిచెన్ కమిటీ సభ్యులతో వీడియో సమావేశం నిర్వహించిన కలెక్టర్.. అదనపు స్మార్ట్ కిచెన్ల నిర్మాణ పురోగతి, భోజన తయారీ, రవాణా, వడ్డింపు, నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో వినూత్నంగా అమలవుతున్న స్మార్ట్ కిచెన్ విధానం దేశానికే స్ఫూర్తిగా నిలుస్తుండటం జిల్లా యంత్రాంగానికి గర్వకారణమన్నారు. త్వరలోనే జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో రోజూ లక్ష మందికి పైగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రుల నుండి అభినందనలు, ప్రశంసలు అందుకోవడం జరిగిందని.. అన్ని శాఖల సమన్వయంతోనే.. ఈ ఘనత సాధ్యం అయిందన్నారు. అందుకు కృషిచేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళల ఆధ్వర్యంలో కిచెన్ నిర్వాహకులు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేస్తుండటంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం సకాలంలో అందుతోందన్నారు. స్మార్ట్ కిచెన్ల ద్వారా అందిస్తున్న భోజనంపై విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి సానుకూల స్పందన వస్తోందని తెలిపారు. ప్రతి విద్యార్థికి ప్రత్యేక భోజన పళ్లెం అందించే విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. భోజనం పరిశుభ్రంగా, రుచికరంగా తయారు చేయడంతో పాటు నిర్దిష్ట సమయంలో పాఠశాలలకు చేరేలా రవాణా వ్యవస్థను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 80 శాతం ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక ఆహార రవాణా వాహనాల ద్వారా ప్రతిరోజూ మధ్యాహ్న భోజనం అందుతోందని కలెక్టర్ తెలిపారు. మిగిలిన పాఠశాలలకు కూడా స్మార్ట్ కిచెన్ సేవలను విస్తరించేందుకు చేపట్టిన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఇంకా అవసరమైన ప్రాంతాల్లో కొత్త స్మార్ట్ కిచెన్ల ఏర్పాటుకు టెండర్ల ప్రక్రియను కూడా పూర్తి చేయాలన్నారు. శిక్షణ పొందిన బాధ్యతాయుతమైన డ్రైవర్ల ద్వారా ఆహార రవాణా వాహనాల్లో భోజనాన్ని పాఠశాలలకు తరలిస్తున్నామని తెలిపారు. వంట తయారీ నుంచి రవాణా, వడ్డింపు వరకు ప్రతి దశలో నాణ్యత, పరిశుభ్రత, సమయపాలనకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. సమావేశంలో జెడ్పి సీఈవో సుబ్రహ్మణ్యం, డీఈవో శంశుద్దీన్, ఎస్ఎస్ఏ ఏపిసి అనురాధ, స్మార్ట్ కిచెన్ల నోడల్ అధికారి జోయల్ విజయ్ కుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ మద్దన్న, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏడుకొండలు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శ్రీనివాసులు, సంబంధిత ఇంజనీరింగ్ శాఖల అధికారులు, విద్యాశాఖ అధికారులు, పౌర సరఫరాలు, రవాణా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలి

బాల్య వివాహాలు, టీనేజ్ గర్భధారణల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

మదనపల్లి, మహి న్యూస్, అక్టోబర్ 07: జిల్లాలో సెప్టెంబర్ 9 నుంచి నిర్వహిస్తున్న పోషణ్ మాసం కార్యక్రమాల్లో భాగంగా బుధవారం మదనపల్లి పట్టణంలోని ఆర్.ఆర్. ఫంక్షన్ హాల్‌లో జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ్ అభయాన్ కార్యక్రమం నిర్వహించారు. మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషాతో కలిసి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పోషకాహార లోపం నివారణతో పాటు మహిళలు, చిన్నారుల ఆరోగ్యం, సంక్షేమం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు, టీచర్లు, హెల్పర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. గ్రామీణ స్థాయిలో అంగన్‌వాడీ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తోందని, పోషకాహారంపై అవగాహనతో పాటు బాల్య వివాహాల నివారణ, టీనేజ్ గర్భధారణల నియంత్రణ, మలేరియా, కోవిడ్ తదితర అంశాల్లోనూ సిబ్బంది సమర్థవంతంగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. చిరుధాన్యాలను ప్రజల రోజువారీ ఆహారంలో భాగం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంగన్‌వాడీ పరిధిలోని లబ్ధిదారుల కుటుంబాల్లో చిరుధాన్యాల వినియోగం ఎంతవరకు పెరిగిందో ప్రత్యేకంగా సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. వారానికి కనీసం రెండు, మూడు సార్లు చిరుధాన్యాలు తీసుకుంటున్నారా, తీసుకోకపోతే కారణాలేమిటో గుర్తించి తగిన కార్యాచరణ చేపట్టాలని సూచించారు. రాయలసీమలో సంప్రదాయంగా వినియోగించే జొన్నలు, కొర్రలు, అండుకొర్రలు తదితర చిరుధాన్యాలను అంగన్‌వాడీ కేంద్రాల ఆహారంలో భాగం చేసేలా ప్రతి ప్రాజెక్టు పరిధిలో కొన్ని కేంద్రాలను పైలట్‌గా ఎంపిక చేసి, వారానికి కనీసం ఒకరోజు చిరుధాన్యాలతో కూడిన ప్రత్యేక ఆహారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు, టీనేజ్ గర్భధారణలు ఆందోళన కలిగించే అంశాలని, 18 సంవత్సరాల లోపు గర్భధారణలను నియంత్రించేందుకు అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, కార్యకర్తలు, హెల్పర్లు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామస్థాయిలో నిరంతరం అవగాహన కల్పిస్తూ అవసరమైన సందర్భాల్లో సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. మహిళలు, చిన్నారుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేయడంలో అంగన్‌వాడీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. పోషణ్ మాసం కార్యక్రమంతో పాటు పోషకాహారం, చిరుధాన్యాల వినియోగం, మహిళలు--చిన్నారుల ఆరోగ్యం, బాల్య వివాహాల నివారణ, టీనేజ్ గర్భధారణల నియంత్రణపై సమన్వయంతో పనిచేస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ.... చిన్నారుల సంరక్షణ, వారి భవిష్యత్ నిర్మాణంలో అంగన్‌వాడీ సిబ్బంది అందిస్తున్న సేవలు అమూల్యమన్నారు. తల్లిదండ్రులను గౌరవిస్తూ, ఒకరినొకరు గౌరవించుకునే విధంగా మంచి సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వ స్థలాలు కేటాయించి శాశ్వత భవనాలు నిర్మించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. సొంత భవనాలు అందుబాటులోకి వస్తే చిన్నారులకు మరింత మెరుగైన వసతులు కల్పించవచ్చన్నారు. కలెక్టర్ నిశాంత్ కుమార్ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే కొనియాడారు. అక్టోబర్ 2న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తదితరులు పాల్గొన్న కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా పనిచేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సంబంధించి తాను చేసిన విజ్ఞప్తులపై జిల్లా యంత్రాంగం సానుకూలంగా స్పందించి రహదారుల అభివృద్ధికి చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్రజల సమస్యలను ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం ఎంత ముఖ్యమో, వాటి పరిష్కారానికి జిల్లా యంత్రాంగం సహకారం కూడా అంతే అవసరమని, జిల్లా కలెక్టర్ నేతృత్వంలో సమర్థవంతమైన పాలన కొనసాగుతున్నందుకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎమ్మెల్యే షాజహాన్ బాషా గర్భిణులకు శ్రీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించి వారిని ఆశీర్వదించారు.

అన్నమయ్య జిల్లాకు స్వచ్ఛ అంగన్‌వాడీ అవార్డులు--2026

స్వచ్ఛ అంగన్‌వాడీ అవార్డులు--2026లో భాగంగా ఉత్తమ పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ, పిల్లలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించినందుకు అన్నమయ్య జిల్లాకు చెందిన అంగన్‌వాడీ కేంద్రాలు, సిబ్బంది రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డులకు ఎంపికయ్యారు.

రాష్ట్ర స్థాయి అవార్డు:

లిమదనపల్లి బసినికొండ--2 అంగన్‌వాడీ కేంద్రానికి చెందిన డి. విజయలక్ష్మీదేవి రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికయ్యారు.

జిల్లా స్థాయి అవార్డులు:

1. పుంగనూరు--గూడూరుపల్లి అంగన్‌వాడీ కేంద్రం -- టి. నాగరత్నమ్మ
2. వాల్మీకిపురం--4 అంగన్‌వాడీ కేంద్రం -- ఎస్. నజమున్నిసా
3. పీలేరు--ఎర్రంరెడ్డికుంట అంగన్‌వాడీ కేంద్రం -- జి. కళావతి
4. కురబలకోట--2 అంగన్‌వాడీ కేంద్రం -- ఎ. లలితమ్మ

అంగన్‌వాడీ ఉత్సవ్, పోషణ్ మా కార్యక్రమాల్లో విశేష కృషికి సన్మానం

అంగన్‌వాడీ ఉత్సవ్, పోషణ్ మా కార్యక్రమాల నిర్వహణలో చురుకుగా పాల్గొని విజయవంతం చేయడంలో విశేషంగా కృషి చేసిన అంగన్‌వాడీ కార్యకర్తలను ఈ సందర్భంగా సన్మానించారు. బి.కొత్తకోటకు చెందిన పి. అంజలమ్మ, లక్కిరెడ్డిపల్లికి చెందిన టి. నాగరాణి, మదనపల్లికి చెందిన డి.ఆర్. మధురవాణి, పీలేరుకు చెందిన ఎస్. అన్నపూర్ణ, పుంగనూరుకు చెందిన జి. రోజా, రాయచోటికి చెందిన ఎన్. ఓబులమ్మ, తంబళ్లపల్లికి చెందిన మిరియాల రమాదేవి, వాల్మీకిపురానికి చెందిన ఎం. గులాబ్జన్లను ముఖ్య అతిథుల చేతుల మీదుగా దుశ్శాలువాతో సత్కరించి, జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎమ్మెల్యే షాజహాన్ బాషా జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ పీడీ హైమవతి, సీడీపీవోలు సుజాత రెడ్డి, నాగవేణి, రాజేశ్వరి, భారతి, రెడ్డి రమణమ్మ, భాగ్యమ్మ, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ నిరుద్యోగులకు స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలి

గ్రూప్-1 అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించాలి



అనంతపురం, మహి న్యూస్, అక్టోబర్ 7: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎస్సీ నిరుద్యోగులు, నిరుపేద విద్యార్థుల కోసం ప్రత్యేకంగా స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా ఎస్సీ--ఎస్టీ ఐక్యవేదిక, అప్పా కమిటీ, ఎంఎస్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్--1 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఎంతో మంది విద్యార్థులు, అభ్యర్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అయితే ఎస్సీ వర్గాలకు చెందిన నిరుద్యోగులు, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందేందుకు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, ఇందుకోసం వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న శ్రీకృష్ణదేవరాయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అకాడమిక్ డెవలప్మెంట్ (స్కాడ్) ద్వారా ఎస్సీ విద్యార్థులు, నిరుద్యోగులకు గ్రూప్--1తో పాటు ఇతర పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు చొరవ తీసుకుని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ ఉపకులపతితో చర్చించాలని, అదే విధంగా జిల్లా కలెక్టర్ స్కాడ్‌కు అవసరమైన బడ్జెట్ కేటాయించి ఎస్సీ విద్యార్థులకు శిక్షణ అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులను కలిసి నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఎస్సీ నిరుద్యోగులు, నిరుపేద విద్యార్థులకు పోటీ పరీక్షల శిక్షణ అందించడం ద్వారా వారికి ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మధు ప్రసాద్, మద్దెలచెరువు వెంకీ, సాకే తిరుపాల్, నాగభూషణం, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో సీఎం చంద్రబాబుకు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ స్వాగతం

సహచర ఎంపీలతో కలిసి ఢిల్లీ విమానాశ్రయంలో ఘన స్వాగతం

ప్రధాని మోదీ, పలువురు కేంద్ర మంత్రులతో వరుస భేటీలు

రాష్ట్ర అభివృద్ధి, మౌలిక వసతులు, నదుల అనుసంధానంపై చర్చ



న్యూఢిల్లీ, అక్టోబర్ 7: (మహి న్యూస్): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనకు చేరుకున్నారు. ఈ సందర్భంగా అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సహచర ఎంపీలతో కలిసి ఢిల్లీ విమానాశ్రయంలో ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా చంద్రబాబు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులతో వరుసగా భేటీ కానున్నారు. అలాగే సీఐఐ భాగస్వామ్య సదస్సు కర్టెన్ రైజర్ కార్యక్రమంలో పాల్గొననున్నారు. రాష్ట్రానికి సంబంధించిన కీలక అభివృద్ధి అంశాలు, మౌలిక వసతుల ప్రాజెక్టులు, నదుల అనుసంధానం, గోదావరి వరద జలాల సద్వినియోగం తదితర అంశాలపై కేంద్రంతో చర్చించనున్నట్లు సమాచారం.

జిల్లా స్థాయిలో 9వ జాతీయ పోషణ మాస కార్యక్రమాలు

పోషకాహారంపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి





కర్నూలు, అక్టోబర్ 7: (మహి న్యూస్): జిల్లా స్థాయిలో 9వ జాతీయ పోషణ మాస కార్యక్రమాలను బుధవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొని పోషకాహారం, తల్లులు--శిశువుల ఆరోగ్యం, రక్తహీనత నివారణపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. గ్రామ స్థాయిలోనూ పోషణ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని అధికారులు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారంపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికి చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పారామెడికల్ కోర్సులకు ఈనెల 14లోపు దరఖాస్తులు

అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలలో 130 సీట్లు

ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు


అక్టోబర్ 14లోపు దరఖాస్తుల సమర్పణ

అనంతపురం, అక్టోబర్ 7: (మహి న్యూస్) అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి పారామెడికల్ కోర్సుల్లో ఖాళీగా ఉన్న 130 సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. విజయశ్రీ తెలిపారు. డీఎంఎల్‌టీ 30, డీఓఏ 10, డీఆర్‌జీఏ 10, డీఈసీజీ 10, డీఎంఐటీ 40, డీఏఓటీటీ 30 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈ కోర్సులకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను www.apsahpc.co.in, www.appmb.co.in, ananthapuramu.ap.gov.in వెబ్‌సైట్ల నుంచి పొందవచ్చని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను అక్టోబర్ 14లోపు ప్రిన్సిపల్, ప్రభుత్వ వైద్య కళాశాల, అనంతపురం చిరునామాకు పంపాలని సూచించారు.

ఆపిల్ ఇండస్ట్రీస్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్

సీఐఐ భాగస్వామ్య సదస్సుకు పరిశ్రమల ప్రతినిధులకు ఆహ్వానం

విస్తరణ, నూతన యూనిట్ల ఏర్పాటుకు అవకాశం



అనంతపురం, అక్టోబర్ 7: (మహి న్యూస్) డి.హీరేహాల్ మండలంలోని ఆపిల్ ఇండస్ట్రీస్‌ను జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ బుధవారం సందర్శించారు. పరిశ్రమ కార్యకలాపాలను పరిశీలించి ప్రతినిధులతో వివరాలు తెలుసుకున్నారు. ఈ నెల 23న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొనాలని పరిశ్రమ ప్రతినిధులను కలెక్టర్ కోరారు. పరిశ్రమల విస్తరణ లేదా నూతన యూనిట్ల ఏర్పాటుకు ఆసక్తి ఉన్న కంపెనీలు సదస్సులో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సుయశ్ కుమార్, జీఎం డీఐసీ శ్రీనివాస్ యాదవ్, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

వర్షాభావ పరిస్థితుల్లోనూ పెల్లెటైజ్డ్ పీఎండీఎస్‌తో ఆశాజనక ఫలితాలు

16 ఎకరాల వర్షాధార మామిడి తోటలో మంచి మొలకలు

రైతులతో పంటల పరిస్థితిపై విజయ్ కుమార్ ముఖాముఖి

ప్రకృతి వ్యవసాయాన్ని కొనసాగించాలని సూచన





అనంతపురం, అక్టోబర్ 7: (మహి న్యూస్) కందుకూరు గ్రామంలో రైతు రాజు 16 ఎకరాల వర్షాధార మామిడి తోటలో చేపట్టిన పెల్లెటైజ్డ్ పీఎండీఎస్ క్షేత్రాన్ని ఏపీసీఎన్ఎఫ్--రైతుసాధికార సంస్థ, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి. విజయ్ కుమార్ సందర్శించారు. గత మూడు నెలలుగా తక్కువ వర్షపాతం ఉన్నప్పటికీ పెల్లెటైజ్డ్ పీఎండీఎస్‌తో మంచి మొలకలు వచ్చినట్లు రైతు వివరించారు. క్షేత్రాన్ని పరిశీలించిన విజయ్ కుమార్ తక్కువ వర్షపాతం ఉన్నా మంచి ఫలితాలు రావడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. భూమిని వదిలిపెట్టకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను కొనసాగిస్తున్న రైతు రాజును అభినందించారు. అనంతరం అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో ముఖాముఖి నిర్వహించారు. పెల్లెటైజ్డ్ పీఎండీఎస్, కాంపాక్ట్ బ్లాక్‌ల ద్వారా కలిగిన ప్రయోజనాలు, తక్కువ వర్షపాతం వల్ల పంటలపై ప్రభావం, భూమిలో తేమ పరిస్థితులపై రైతుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల సాగును కొనసాగించడం, పెల్లెటైజ్డ్ పీఎండీఎస్‌ను విస్తరించడం, కాంపాక్ట్ బ్లాక్‌ల ద్వారా భూమి ఆరోగ్యం, పంటల స్థిరత్వాన్ని మెరుగుపరచడంపై రైతులతో చర్చించారు. తక్కువ వర్షపాతం ఉన్నప్పటికీ ప్రకృతి వ్యవసాయాన్ని నమ్మకంతో కొనసాగిస్తూ తమ అనుభవాలను ఇతర రైతులతో పంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ ప్రోగ్రామ్ మేనేజర్లు పవన్ ముంతా, డాక్టర్ నవీన్, రెండు జిల్లాలకు చెందిన రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

డి.హీరేహాల్‌లో జిల్లా కలెక్టర్ విస్తృత పర్యటన

అంగన్‌వాడీ కేంద్రం, వెలుగు కార్యాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్ తనిఖీ

శానిటరీ కాంప్లెక్స్ పనులు త్వరగా పూర్తి చేయాలి

పాఠశాలల్లో డ్రాప్‌అవుట్లు ఉండకూడదు





వీధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి పిల్లలకు అందిస్తున్న మెనూ, భోజన వసతులపై వివరాలు




అనంతపురం, అక్టోబర్ 7: (మహి న్యూస్) డి.హీరేహాల్ మండలంలో జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ బుధవారం విస్తృతంగా పర్యటించి పలు ప్రభుత్వ సంస్థలను తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని కోట తెలుసుకున్నారు. అనంతరం డీఆర్డీఏ వెలుగు కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ స్వచ్ఛ భారత్ మిషన్ కింద చేపడుతున్న శానిటరీ కాంప్లెక్స్, మరుగుదొడ్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల పనితీరు, రికవరీ, ఆర్థిక పురోగతిపై సమీక్షించారు. తర్వాత విలేజ్ హెల్త్ క్లినిక్‌ను తనిఖీ చేసి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. మడేనహళ్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థులందరూ క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా చూడాలని, డ్రాప్‌అవుట్లు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకూడదని స్పష్టం చేశారు. నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సుయశ్ కుమార్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ దాస నాయక్, ఏపీఎం రామకృష్ణ, సీసీలు, యానిమేటర్లు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరవకొండ గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్

విద్యార్థులతో నేరుగా మాట్లాడిన జిల్లా కలెక్టర్

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన





ఉరవకొండ పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి క్షేమం, ఆరోగ్య పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో



అసిస్టెంట్ కలెక్టర్ సుయశ్ కుమార్, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ జ్ఞాన ప్రసన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ కార్యాలయం తాత్కాలిక మార్పు

బుడ్డప్ప నగర్‌లోని ప్రశాంతి జిల్లా సమైక్య కార్యాలయానికి మార్పు

మరమ్మతుల కారణంగా తాత్కాలికంగా కార్యాలయం మార్పు

అనంతపురం, అక్టోబర్ 7: (మహి న్యూస్) విభిన్న ప్రతిభావంతుల, హిజ్రా, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయాన్ని భవనం మరమ్మతుల కారణంగా తాత్కాలికంగా మార్చినట్లు సహాయ సంచాలకులు తెలిపారు. ప్రస్తుతం కార్యాలయాన్ని బుడ్డప్ప నగర్‌లోని ప్రశాంతి జిల్లా సమైక్య కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు ఈ మార్పును గమనించి కార్యాలయ పనివేళల్లో అక్కడి నుంచే సంబంధిత సేవలను పొందాలని సూచించారు.

అమరావతిలో మంత్రి మండలి సమావేశం

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సమావేశం

సమావేశంలో పాల్గొన్న మంత్రి పయ్యావుల కేశవ్





అమరావతి, అక్టోబర్ 7: (మహి న్యూస్) అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన బుధవారం మంత్రి మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఇతర మంత్రులతో కలిసి పాల్గొన్నారు.

గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌పై కేంద్ర ఆర్థిక మంత్రితో చర్చ

నిర్మలా సీతారామన్‌తో సీఎం చంద్రబాబు, మంత్రి పయ్యావుల కేశవ్ భేటీ

జిల్లాల వారీగా చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాల అంశంపైనా చర్చ





అనంతపురం, అక్టోబర్ 7: (మహి న్యూస్) ఢిల్లీ పర్యటనలో భాగంగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితో కలిసి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను బుధవారం కలిశారు. ఈ సందర్భంగా గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు జిల్లాల వారీగా చేపట్టాల్సిన కార్యాచరణ, ప్రాజెక్టు అమలుకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరై, ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న కేంద్ర ఆర్థిక మంత్రికి సీఎం చంద్రబాబు, మంత్రి పయ్యావుల కేశవ్ ధన్యవాదాలు తెలిపారు. ఎక్సటర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్టుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలకు సంబంధించిన అంశాలపైనా సమావేశంలో చర్చించారు.

జిప్మెర్ ఆసుపత్రిలో ఫైర్ మాక్ డ్రిల్





యానం, మహి న్యూస్, అక్టోబర్ 7: యానం కేంద్రపాలిత ప్రాంతంలోని జిప్మెర్ ఆసుపత్రిలో బుధవారం ఫైర్ మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్నిమాపక పరికరాలను వినియోగించే విధానం, అత్యవసర సమయాల్లో రోగులను సురక్షితంగా తరలించే చర్యలపై ఆసుపత్రి సిబ్బందికి అవగాహన కల్పించారు. స్టేషన్ ఫైర్ ఆఫీసర్ గంగరాజు ఆధ్వర్యంలో ఇన్‌స్ట్రక్టర్ కేఎల్ కృష్ణారావు, ఫైర్ సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించి ఫైర్ ఫైటింగ్ పద్ధతులను ప్రదర్శించారు. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో భయాందోళనలకు గురికాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిప్మెర్ ఆసుపత్రి సీఎంఓ.డాక్టర్ ఆనంద్ రాజు, వైద్యులు, నర్సింగ్ సూపర్‌వైజర్లు, నర్సింగ్ ఆఫీసర్లు, సెక్యూరిటీ ఆఫీసర్లు, సెక్యూరిటీ సిబ్బంది, ఇతర ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. ఆసుపత్రిలో అగ్ని ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ అవగాహనతో, సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని అధికారులు తెలిపారు.

ముమ్మిడివరంలో ఈవీ బైక్ షోరూమ్ ప్రారంభం



ముమ్మిడివరం, మహి న్యూస్, అక్టోబర్ 7: ముమ్మిడివరంలో ఎంకే ఆటోమోటివ్ సంస్థకు చెందిన నూతన ఈవీ బైక్ షోరూమ్‌ను ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూమ్‌లో ఏర్పాటు చేసిన వివిధ రకాల ఎలక్ట్రిక్ బైక్‌లను ఆయన పరిశీలించారు. అనంతరం ఓ ఈవీ బైక్‌ను స్వయంగా నడిపి, వాటి పనితీరు, ధరలు, ఇతర వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంకే ఆటోమోటివ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ.. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా వివిధ రకాల ఈవీ బైక్‌లు, ఆటో లోడర్లు తదితర వాహనాలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. బైక్‌ల విక్రయాలతో పాటు అన్ని ఈవీ వాహనాలకు సర్వీస్ సదుపాయాన్ని కూడా అందిస్తున్నట్లు చెప్పారు. ఈవీ బైక్‌ల ప్రారంభ ధర రూ.75 వేలుగా ఉందని రవికుమార్ తెలిపారు. ముఖ్యంగా ఆటో లోడర్లు చిరు వ్యాపారులకు సరుకుల రవాణాలో ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు నిర్వహణ ఖర్చులను తగ్గించుకునేందుకు ఎలక్ట్రిక్ వాహనాలు ఉపయోగపడతాయని తెలిపారు.

మత్స్యశాఖ సమస్యల పరిష్కారానికి కేంద్ర అధికారులను కలిసిన మంత్రి మల్లాడి



యానాం (ఢిల్లీ), మహి న్యూస్, అక్టోబర్ 7: పుదుచ్చేరి మత్స్యశాఖకు సంబంధించిన పెండింగ్ అంశాల పరిష్కారంపై కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో పుదుచ్చేరి ప్రజా పనులు, మత్స్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వ మత్స్యశాఖ కార్యదర్శి డాక్టర్ అభిలాష్ లిక్కి, సంయుక్త కార్యదర్శి డాక్టర్ సురభిరాయ్ తదితర అధికారులతో సమావేశమైన మంత్రి, పుదుచ్చేరి, యానాం ప్రాంతాల్లోని మత్స్యశాఖకు సంబంధించిన పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పుదుచ్చేరి, యానాం ప్రాంతాల్లో ఫిషింగ్ హార్బర్ల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై మంత్రి అధికారులకు వినతిపత్రం సమర్పించారు. పుదుచ్చేరి తీరంలోని ఫిషింగ్ హార్బర్ ముఖద్వారం వద్ద ఇసుక, మట్టి పేరుకుపోవడంతో మత్స్యకారుల పడవలు, బోట్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. ఈ సమస్య శాశ్వతంగా పరిష్కారమయ్యేలా హార్బర్ ముఖద్వారం పునర్వ్యవస్థీకరణకు చర్యలు చేపట్టాలని కోరారు. సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం సమగ్ర సాంకేతిక అధ్యయనం నిర్వహించేందుకు సమర్థవంతమైన సాంకేతిక సంస్థను ఎంపిక చేయాలని మంత్రి కోరారు. ఇందుకోసం బెంగళూరులోని సీఐసీఈఎఫ్ (జxజజుఖీ) సంస్థకు తగిన ఆదేశాలు జారీ చేయాలని కేంద్ర అధికారులను విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా యానాం సావిత్రినగర్‌లో కేంద్ర మత్స్యశాఖ సహకారంతో ఫిషింగ్ హార్బర్ మొదటి విడత నిర్మాణ పనులు ఇప్పటికే పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. మత్స్యకారుల పడవలకు బెర్తింగ్ సౌకర్యం కల్పించడంతో పాటు పరిశుభ్రమైన వాతావరణంలో చేపల విక్రయాలు, ట్రేడింగ్ నిర్వహించేందుకు రెండో విడత హార్బర్ పనులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం రూ.43 కోట్లతో రెండో విడత పనులకు సూత్రప్రాయ అనుమతి మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరారు. యానాం మత్స్యశాఖ కార్యాలయం వద్ద ఉన్న 3 టన్నుల సామర్థ్యం గల ఐస్ ప్లాంట్ శిథిలావస్థకు చేరిందని మంత్రి అధికారులకు వివరించారు. మత్స్యకారుల అవసరాలు, పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని 10 టన్నుల సామర్థ్యం కలిగిన కొత్త ఐస్ ప్లాంట్ ఏర్పాటుకు అనుమతి మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పుదుచ్చేరి, యానాం ప్రాంతాల మత్స్యకారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కేంద్ర మత్స్యశాఖ అధికారులు సహకరించాలని మంత్రి మల్లాడి కృష్ణారావు కోరారు.

చిన్నగార్లపాడులో విస్తృత కార్డన్ అండ్ సెర్చ్

సరైన పత్రాలు లేని 17 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
53 మంది పోలీసు సిబ్బందితో ఇళ్లలో క్షుణ్ణంగా తనిఖీలు
నేరాల నియంత్రణ, ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసుల ప్రత్యేక తనిఖీలు



కారంపూడి, అక్టోబర్ 7:(మహి న్యూస్): పల్నాడు జిల్లాలో నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడి, ప్రజల భద్రతను మరింత పటిష్టం చేయడమే లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ చేపడుతున్న కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లలో భాగంగా కారంపూడి పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్నగార్లపాడు గ్రామంలో బుధవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ జగదీష్ ఆదహళ్లి, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు కారంపూడి సర్కిల్ ఇన్స్పెక్టర్ భాస్కర్ ఆధ్వర్యంలో ఈ ఆపరేషన్ కొనసాగింది. గురజాల సబ్ డివిజన్‌కు చెందిన 5 మంది సబ్ ఇన్స్పెక్టర్లు, మొత్తం 53 మంది పోలీసు సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. కార్డన్ అండ్ సెర్చ్‌లో భాగంగా చిన్నగార్లపాడు గ్రామంలోని ఇళ్లను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 17 ద్విచక్ర వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాలకు సంబంధించిన పత్రాలు, యాజమాన్య వివరాలను పోలీసులు తదుపరి పరిశీలిస్తున్నారు.

ప్రజలకు పోలీసుల అవగాహన

తనిఖీల అనంతరం పోలీసులు గ్రామస్థులతో మమేకమై నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని వివరించారు. గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు లేదా అసాంఘిక కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అదేవిధంగా రోడ్డు భద్రత, హెల్మెట్ వినియోగం, మహిళలు మరియు బాలల భద్రత, పోక్సో చట్టం, సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల నిర్మూలన తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పల్నాడు జిల్లాలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో భాగంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు, ఆపరేషన్ త్రిశూల్, ప్రజా అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని పోలీసు అధికారులు తెలిపారు.



ఇంటింటా పర్యటనతో ప్రజా సమస్యల గుర్తింపు



మాచర్ల, అక్టోబర్ 7:(మహి న్యూస్): మాచర్ల పట్టణంలోని 6వ వార్డు చెన్నకేశవ కాలనీలో కూటమి నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రతి గడపను సందర్శించి స్థానికులను పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు, ఇంకా అందాల్సిన సౌకర్యాలు, స్థానికంగా నెలకొన్న సమస్యలపై వివరాలను సేకరించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా నాయకులు, కార్యకర్తల దృష్టికి తీసుకువచ్చేలా కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా వార్డు ఇన్‌చార్జి ఆలేటి వాసు, బూత్ ఇన్‌చార్జి నార్ల రాములు మాట్లాడుతూ ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను గుర్తించేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు సమన్వయంతో పాల్గొని ప్రజల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాస్తవ విస్తీర్ణం మేరకే భూ సమీకరణ
పత్రాలు, రీ సర్వే ఆధారంగా భూముల స్వీకరణ
ప్రభుత్వ భూమిని భూ సమీకరణలో చేర్చేది లేదు
స్పష్టం చేసిన జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ



గుంటూరు, అక్టోబర్ 7: (మహి న్యూస్):: అమరావతి రెండో విడత భూ సమీకరణలో రైతులు వాస్తవంగా చూపిన విస్తీర్ణం మేరకు మాత్రమే భూములను తీసుకుంటామని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ స్పష్టం చేశారు. తుళ్లూరు మండలం వడ్డమాను గ్రామంలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని రైతులతో భూ సమీకరణ అంశాలపై చర్చించారు. రీ సర్వే, పట్టాదారు పాసు పుస్తకం తదితర అధికారిక పత్రాల ఆధారంగా భూమి వాస్తవ విస్తీర్ణాన్ని నిర్ధారిస్తామని కలెక్టర్ తెలిపారు. రైతులు తమ భూములకు సంబంధించిన స్పష్టమైన హద్దులను పత్రాల ఆధారంగా చూపించాలని సూచించారు. ఆధార్, బ్యాంక్ పాసు పుస్తకం, పట్టాదారు పాసు పుస్తకం, టైటిల్ డీడ్, రిజిస్ట్రేషన్, లింక్ డాక్యుమెంట్లు, ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ నంబర్, రెండు ఫొటోలు సమర్పించాలని కోరారు. డొంక రోడ్లు, ప్రభుత్వ భూమి కలిసిన భూముల విషయంలో కూడా వాస్తవంగా ఉన్న విస్తీర్ణాన్ని మాత్రమే భూ సమీకరణలోకి తీసుకుంటామని, ప్రభుత్వ భూమిని కలిపి తీసుకునే అవకాశం లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రైతులు తమ వద్ద ఉన్న పాత భూమి పత్రాల్లోని కొలతలకు, రీ సర్వేలో నమోదైన కొలతలకు తేడాలు ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కొన్ని భూములను చెరువు పడకగా చూపిస్తున్నారని, వాటిని పరిశీలించి సరిచేయాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ కొల్లాబత్తుల కార్తీక్, రెవెన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీనివాసరావు, డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర, తహసీల్దార్ హరిబాబు, సర్వే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

హజ్ 2027 సేవా సహాయకుల ముఖాముఖి
78 మంది అభ్యర్థులకు ముఖాముఖి పరీక్షలు
మార్కుల ఆధారంగా 19 మందిని ఎంపిక చేయనున్న కేంద్ర హజ్ కమిటీ
సేవా దృక్పథంతో పనిచేయాలి: అధికారులు
విజయవాడ నుంచి హజ్‌కు వెళ్లే ప్రతి హాజీకి రూ.లక్ష ఆర్థిక సాయం



మంగళగిరి, అక్టోబర్ 7: (మహి న్యూస్): హజ్ 2027 యాత్రకు ఆంధ్రప్రదేశ్ నుంచి సేవా సహాయకులుగా ఎంపికైన 78 మంది ప్రభుత్వ ఉద్యోగులకు బుధవారం మంగళగిరి మండలం వడ్డేశ్వరంలోని సీఈడీఎం కార్యాలయంలో ముఖాముఖి పరీక్షలు నిర్వహించారు. భారత హజ్ కమిటీ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ ప్రక్రియలో పత్రాల పరిశీలన అనంతరం ముఖాముఖి పరీక్షలు చేపట్టారు. మార్కుల ఆధారంగా 19 మందిని కేంద్ర హజ్ కమిటీ ఎంపిక చేయనుంది. రాష్ట్ర హజ్ కమిటీ అధ్యక్షుడు హాజీ షేక్ హసన్ భాష, కార్యనిర్వహణ అధికారి అబ్దుల్ ఖాదర్ పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా మైనారిటీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సీహెచ్ శ్రీధర్, వక్ఫ్ బోర్డు సీఈఓ యాకూబ్ భాష పాల్గొన్నారు. హజ్ సేవా సహాయకులు అధికారులుగా కాకుండా సేవకులుగా యాత్రికులకు అందుబాటులో ఉండాలని, సేవా దృక్పథంతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని అధికారులు సూచించారు. హజ్ హౌస్ నిర్మాణాన్ని త్వరలో చేపడతామని తెలిపారు. హజ్ ఇస్లాం ధర్మంలోని ఐదు మూల స్తంభాల్లో ఒకటని, ఆర్థికంగా, శారీరకంగా స్థోమత ఉన్న ముస్లింలు జీవితంలో ఒక్కసారైనా నిర్వహించాల్సిన పవిత్ర యాత్ర అని పేర్కొన్నారు. హాజీలకు సేవ చేయడం అత్యంత పుణ్యకార్యంగా భావిస్తారని, అందువల్ల సేవా సహాయకుల పాత్ర కీలకమని తెలిపారు. కూటమి ప్రభుత్వం ముస్లిం సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని, విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి హజ్‌కు వెళ్లే ప్రతి హాజీకి రూ.1 లక్ష ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. విజయవాడను అధికారిక ఎంబార్కేషన్ పాయింట్‌గా కేంద్రం ఆమోదించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హజ్ కమిటీ సభ్యులు బాబా ఫక్రుద్దీన్, మన్సూర్ అలీ ఖాన్, షేక్ హుస్సేన్, షేక్ ఆబిద్, హజ్ కమిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





ఎస్.ఆర్. శంకరన్ జీవితం ప్రజాసేవకు ప్రతీక
పేదలు, దళితులు, గిరిజనుల సంక్షేమానికి జీవితాంతం కృషి
వెట్టి చాకిరి నిర్మూలనకు విశేష కృషి
జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

గుంటూరు, అక్టోబర్ 7: (మహి న్యూస్): ఎస్.ఆర్. శంకరన్ జీవితం ప్రజాసేవకు ప్రతీకగా నిలిచిందని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. ఎస్.ఆర్. శంకరన్ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పరిపాలనా సామర్థ్యంతో విశిష్ట సేవలు అందించిన శంకరన్, పేదలు, దళితులు, గిరిజనులు, కార్మికులు, అణగారిన వర్గాల సంక్షేమం కోసం జీవితాంతం కృషి చేశారని తెలిపారు. పరిపాలన ద్వారా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో పనిచేశారని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, విద్య, వసతి గృహాలు, సంక్షేమ పథకాల అమలుకు ప్రాధాన్యత ఇచ్చారని, ట్రైబల్ సబ్‌ప్లాన్, స్పెషల్ కాంపోనెంట్ ప్లాన్ వంటి కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషించారని తెలిపారు. వెట్టి చాకిరి వ్యవస్థ నిర్మూలనకు కూడా విశేషంగా కృషి చేశారని గుర్తుచేశారు. నిజాయితీ, నిరాడంబరత, మానవతా దృక్పథం, సామాజిక న్యాయం, ప్రజాసేవకు ఎస్.ఆర్. శంకరన్ ప్రతీకగా నిలిచారని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, కలెక్టర్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి గర్భిణీ వివరాలు నమోదు చేయాలి
హైరిస్క్ గర్భిణీలను ముందుగానే గుర్తించాలి
అంగన్వాడీల్లో చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



గుంటూరు, అక్టోబర్ 7: (మహి న్యూస్): ప్రతి గర్భిణీ వివరాలను గర్భం దాల్చిన వెంటనే నమోదు చేయాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యక్రమాలపై బుధవారం కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. గర్భిణీల వివరాలు పూర్తిగా నమోదు చేసి హైరిస్క్ కేసులను ముందుగానే గుర్తించాలని, రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పౌష్టికాహారం అందేలా పర్యవేక్షించడంతో పాటు ఆసుపత్రి ప్రసవాలపై అవగాహన కల్పించాలన్నారు. టీనేజ్ గర్భధారణలను నివారించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు, ఎత్తు, బరువు, ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలని, అంగన్వాడీ నుంచి బయటకు వెళ్లే ప్రతి చిన్నారి మొదటి తరగతిలో చేరేలా చూడాలని సూచించారు. అంగన్వాడీల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు మెరుగైన సేవలు అందేలా పర్యవేక్షణ పెంచాలని తెలిపారు. సమావేశంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.జి. ప్రసూన, సీడీపీఓలు, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.



తెలుగు సాహిత్యం విలువ వెలకట్టలేనిది
ఏపీ సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి
ఘనంగా ప్రారంభమైన అమరావతి సాహిత్య ఉత్సవాలు
50 మందికి పైగా కవులు, రచయితల హాజరు




అమరావతి, అక్టోబర్ 7: (మహి న్యూస్): తెలుగు భాష, సాహిత్యం విలువ వెలకట్టలేనిదని, మనిషిని మహోన్నతుడిగా తీర్చిదిద్దే శక్తి సాహిత్యానికి ఉందని ఏపీ సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి అన్నారు. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో బుధవారం అమరావతి సాహిత్య ఉత్సవాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా తేజస్వి పొడపాటి మాట్లాడుతూ డిజిటల్ యుగంలో యువత అక్షరం, మాతృభాష విలువను విస్మరించకూడదన్నారు. తెలుగు భాషను విశ్వవ్యాప్తం చేసేందుకు సంస్కృతి కమిషన్ చర్యలు చేపడుతోందని తెలిపారు. జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ పుస్తక పఠనం ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు సంభాషణా నైపుణ్యాలను మెరుగుపరుస్తుందని అన్నారు. అమరావతి గొప్పదనాన్ని ప్రపంచానికి చాటేలా సాహిత్య ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వివిధ ప్రాంతాల కవులు, రచయితలను ఒకే వేదికపైకి తీసుకురావడమే ఉత్సవాల లక్ష్యమని యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్ తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ఏపీతో పాటు పలు రాష్ట్రాల నుంచి 50 మందికి పైగా కవులు, రచయితలు హాజరయ్యారు. పుస్తక ప్రదర్శనలు సాహిత్యాభిమానులను ఆకట్టుకున్నాయి.



స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధంగా ఉండాలి
అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలి
స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి
అధికారులకు జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల ఆదేశం



పల్నాడు, అక్టోబర్ 7: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ త్వరలో వెలువడనున్న నేపథ్యంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎస్పీ జగదీశ్‌తో కలిసి ఎన్నికల సన్నద్ధతపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించి భద్రతా ఏర్పాట్లు చేయాలని, బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రిని సిద్ధం చేసుకోవాలని సూచించారు. పోలింగ్, కౌంటింగ్ సిబ్బందిని ఎంపిక చేసి శిక్షణ ఇవ్వాలని, రవాణా, పంపిణీ, రిసెప్షన్‌కు పటిష్ట ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ ఎస్ఈసీ-ఈఎంఎస్‌లో సమాచారాన్ని నమోదు చేయాలని, వెబ్‌కాస్టింగ్‌తో పాటు ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలను ముందుగానే ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎన్నికల ఏర్పాట్లలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా పనిచేయాలని ఎస్పీ జగదీశ్ తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సంజన, జడ్పీ సీఈఓ, డీపీఓ, ఆర్డీఓలు, డీఎస్పీలు, డీఎల్‌డీఓలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



మృత ఉద్యోగి కుటుంబానికి రూ.1.14 కోట్ల బీమా చెక్
ప్రమాద బీమా కింద రూ.1.14 కోట్లు అందజేత
ఎస్‌బీఐ సేలరీ ప్యాకేజీ ఖాతాదారులకు ప్రయోజనం



పల్నాడు, అక్టోబర్ 7: (మహి న్యూస్): ప్రమాదవశాత్తు మృతి చెందిన ఎన్ఎస్పీ కాలువల లస్కర్ అనుమూల శ్రీనివాసరావు కుటుంబానికి రూ.1.14 కోట్ల బీమా మొత్తాన్ని జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల బుధవారం అందజేశారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో మృతుడి భార్య అన్నపూర్ణకు చెక్ అందించారు. శ్రీనివాసరావుకు ఎస్‌బీఐ స్టేట్ గవర్నమెంట్ సేలరీ ప్యాకేజీ ఖాతా ఉండటంతో ప్రమాద బీమా కింద రూ.1.10 కోట్లు, అదనపు బీమా కింద రూ.4 లక్షలు కలిపి మొత్తం రూ.1.14 కోట్లు అందినట్లు అధికారులు తెలిపారు. ఎస్‌బీఐ సేలరీ ఖాతా ద్వారా లభించే బీమా సౌకర్యాలను ప్రభుత్వ ఉద్యోగులు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. క్లెయిమ్ ప్రక్రియలో కుటుంబానికి సహకరించిన ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ రవికుమార్‌ను ఆమె అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ నరసరావుపేట రీజినల్ మేనేజర్ రవికుమార్, పీఎస్ అండ్ ఎస్ నరసరావుపేట బ్రాంచ్ చీఫ్ మేనేజర్ పీఎస్‌వీ కిషోర్ కుమార్, ఆర్‌బీఓ చీఫ్ మేనేజర్ పాల్ బెజలీల్, ఎన్ఎస్పీ డీఏఓ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే క్రిమినల్ కేసులు
నిబంధనలు ఉల్లంఘించే సెంటర్ల లైసెన్సులు రద్దు
ప్రతి స్కానింగ్‌కు ఫారమ్-ఎఫ్‌లో వివరాలు నమోదు తప్పనిసరి
188 స్కానింగ్ సెంటర్లపై నిరంతర తనిఖీలు



నరసరావుపేట, అక్టోబర్ 7: (మహి న్యూస్): అక్రమంగా గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో పీసీ అండ్ పీఎన్‌డీటీ, ఏఆర్‌టీ, సరోగసీ చట్టాల అమలుపై జిల్లా స్థాయి కమిటీలతో సమీక్ష నిర్వహించారు. ప్రైవేట్ ఆసుపత్రులు, అల్ట్రాసౌండ్, ఐవీఎఫ్ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని, నిబంధనలు ఉల్లంఘించే కేంద్రాల లైసెన్సులు రద్దు చేయాలని సూచించారు. ప్రతి స్కానింగ్ సెంటర్ వద్ద 'లింగ నిర్ధారణ పరీక్షలు ఇక్కడ చేయబడవు/నిషేధించబడ్డాయి' అనే బోర్డును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గర్భిణీలకు నిర్వహించే ప్రతి స్కానింగ్ వివరాలను ఫారమ్-ఎఫ్‌లో తప్పనిసరిగా నమోదు చేసి, రికార్డులను ఆడిట్ చేయాలని తెలిపారు. ఆడపిల్లల పట్ల వివక్షను తగ్గించి లింగ నిష్పత్తిని మెరుగుపరిచేందుకు అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో 188 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని డీఎంహెచ్ఓ డాక్టర్ రత్న మనోహన్ తెలిపారు. వీటిలో 14 ప్రభుత్వ, 174 ప్రైవేట్ సెంటర్లు ఉన్నాయని, జిల్లా లింగ నిష్పత్తి 934గా నమోదైందని వివరించారు. మూడు కొత్త స్కానింగ్ సెంటర్లు, 21 పునరుద్ధరణలు, 5 మార్పులు, ఒక రద్దు, 3 ఏఆర్‌టీ క్లినిక్‌లకు వచ్చిన ప్రతిపాదనలను కమిటీ ఆమోదించింది. కార్యక్రమంలో వైద్యాధికారులు, కమిటీ సభ్యులు, పోలీసులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వేలిముద్ర పడక బియ్యం నిలిచిపోవడంతో స్పందించిన తహసీల్దార్
వృద్ధుడి సమస్యను వెంటనే పరిష్కరించి బియ్యం అందజేసిన అధికారులు



మాచర్ల అక్టోబర్ 07: (మహి న్యూస్): మాచర్ల పట్టణానికి చెందిన 60 సంవత్సరాలు పైబడిన శ్రీ మాచర్ల దానం అనే వృద్ధుడు తన రేషన్ కార్డుకు బియ్యం ఇవ్వడం లేదని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆశ్రయించాడు. విషయం తెలుసుకున్న మాచర్ల తహసీల్దార్ కిరణ్ కుమార్ వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపట్టారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు సీఎస్‌డీటీ ద్వారా సంబంధిత రేషన్ షాపు డీలర్‌ను పిలిపించి విచారించగా, సదరు వృద్ధుడి వేలిముద్ర సమోదు కావడం లేదని డీలర్ తెలిపారు. దీంతో తహసీల్దార్ వెంటనే వృద్ధుడి వేలిముద్రను అప్డేట్ చేయాలని ఆదేశించారు. అనంతరం ద్వాక్రా గ్రూప్ ఆధ్వర్యంలోని రేషన్ షాపు డీలర్ ద్వారా సదరు వృద్ధుడికి బియ్యం అందజేశారు. సమస్యను వెంటనే పరిష్కరించి బియ్యం అందించిన తహసీల్దార్ కిరణ్ కుమార్‌కు వృద్ధుడు కృతజ్ఞతలు తెలిపారు.

"మాచర్లలో కోతుల బెడద నియంత్రణకు చర్యలు"
295 కోతులను పట్టుకున్న మున్సిపల్ అధికారులు - శ్రీశైలం అడవులకు తరలింపు



మాచర్ల అక్టోబర్ 7: (మహి న్యూస్): మాచర్ల పురపాలక సంఘ పరిధిలో కోతుల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. కోతులు వీధుల్లో సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని పలుమార్లు మున్సిపల్ కార్యాలయంతో పాటు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) ద్వారా ప్రజలు అర్జీలు సమర్పించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై మున్సిపల్ కమిషనర్ డి. వేణుబాబు స్పందించి కోతులను పట్టించే చర్యలకు ఆదేశించారు. ఇందులో భాగంగా సెప్టెంబర్ 27న 150 కోతులను పట్టుకుని శ్రీశైలం అటవీ ప్రాంతానికి తరలించారు. తాజాగా అక్టోబర్ 7న మరో 145 కోతులను మున్సిపల్ సిబ్బంది పట్టుకున్నారు. వీటిని కూడా శ్రీశైలం అటవీ ప్రాంతానికి తరలించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. రెండు విడతల్లో మొత్తం 295 కోతులను పట్టుకుని తరలిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కోతుల బెడదను నియంత్రించేందుకు మున్సిపల్ శాఖ చర్యలు కొనసాగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.





ప్రయాణికుల భద్రతే లక్ష్యం.. ఆటోలు, సుమోలు, జీపులపై ప్రత్యేక తనిఖీలు

17 కేసులు నమోదు.. రూ.60 వేల జరిమానా

ఆటో యూనియన్ నాయకులతో అవగాహన సమావేశం

అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు



తిరుపతి, అక్టోబర్ 7: (మహా న్యూస్) శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుపతికి వచ్చే భక్తులు, ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో ఆటోలు, సుమోలు, జీపులపై రవాణా శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో అధిక చార్జీల వసూలు, పరిమితికి మించి ప్రయాణికులను తరలించడం, డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్, పర్మిట్ తదితర నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి 17 కేసులు నమోదు చేసి రూ.60 వేల జరిమానా విధించారు. అనంతరం తిరుపతి జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో రైల్వే స్టేషన్ ఆటో యూనియన్ నాయకులతో అవగాహన సమావేశం నిర్వహించారు. నిర్ణయించిన ఆటో చార్జీలను మాత్రమే వసూలు చేయాలని, ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు చెల్లుబాటులో ఉండేలా చూసుకోవాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని స్పష్టం చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా దేశం నలుమూలల నుంచి భక్తులు తిరుపతికి వస్తున్నందున ఆటో డ్రైవర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించి సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు సహకరించాలని అధికారులు కోరారు. రవాణా నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్, సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ పురుషోత్తం, ఎంవీఐ శ్రీనివాసరావు, అతికా నాజ్, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు. ప్రయాణికుల భద్రత, సౌకర్యాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రత్యేక తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

సీఎస్ఆర్, డీఎంఎఫ్ పనుల బిల్లుల చెల్లింపులు వేగవంతం చేయాలి

45 అభివృద్ధి పనులకు రూ.6.84 కోట్ల అంచనా వ్యయం

పూర్తయిన పనుల బిల్లులు వెంటనే సమర్పించాలి

పెండింగ్ బిల్లుల చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేయాలి



తిరుపతి, అక్టోబర్ 7: (మహా న్యూస్) జిల్లాలో సీఎస్ఆర్, డీఎంఎఫ్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ బుధవారం సమీక్షించారు. పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లులను వెంటనే సమర్పించి, పెండింగ్ బిల్లుల చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో సీఎస్ఆర్, డీఎంఎఫ్ నిధులతో మొత్తం 45 పనులను రూ.6.84 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో రూ.4.87 కోట్ల వ్యయంతో చేపట్టిన 31 పనులు పూర్తయ్యాయని, వాటికి సంబంధించిన బిల్లులను సమర్పించాలని సూచించారు. ఇప్పటికే 20 పనులకు డీఎంఎఫ్ నుంచి రూ.2.94 కోట్లు, 3 పనులకు సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.29.32 లక్షలు చెల్లించినట్లు తెలిపారు. మరో 7 బిల్లులకు సంబంధించి రూ.1.06 కోట్ల చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయని, అవసరమైన ఆర్థిక అనుమతుల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సంక్షేమ హాస్టళ్లకు సంబంధించి రూ.77.50 లక్షలతో చేపట్టిన పనుల్లో కొన్ని 80 శాతానికి పైగా, మరికొన్ని 60 శాతానికి పైగా పూర్తయ్యాయని తెలిపారు. పురోగతిలో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయడంతో పాటు ప్రారంభం కాని పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. టెండర్ల ఖరారు ప్రక్రియ పెండింగ్‌లో ఉన్న పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అన్ని అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో భూగర్భ గనుల శాఖ అధికారి బాలాజీ నాయక్, బీసీ సంక్షేమ అధికారి భరత్ రెడ్డి, సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లీసర్వే పనులను పరిశీలించిన జాయింట్ కలెక్టర్

కొబాక, మన్నసముద్రం గ్రామాల్లో క్షేత్రస్థాయి తనిఖీలు

రైతులు, భూ యజమానులతో మాట్లాడిన ఆర్. గోవిందరావు

సర్వే బృందాలకు సహకరించాలని రైతులకు సూచన







ఏర్పేడు, అక్టోబర్ 7: (మహా న్యూస్) ఏర్పేడు మండలంలోని కొబాక, మన్నసముద్రం గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే గ్రౌండ్ ట్రూథింగ్ పనులను జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శ్రీకాళహస్తి ఆర్డీఓ బాను ప్రకాష్ రెడ్డితో కలిసి మాన్యువల్ సర్వే, ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియను తనిఖీ చేశారు. రీసర్వే పనుల పురోగతిని సమీక్షించిన జాయింట్ కలెక్టర్ ఫీల్డ్ వెరిఫికేషన్‌లో పాల్గొంటున్న అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామాల్లోని రైతులు, భూ యజమానులతో ముఖాముఖిగా మాట్లాడి రీసర్వేపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రీసర్వే ప్రక్రియ వేగంగా పూర్తయ్యేలా రైతులు సర్వే బృందాలకు పూర్తిస్థాయిలో సహకరించాలని సూచించారు. అవసరమైన చోట సరైన ఆధారాలు, భూ రికార్డులను అందించాలని కోరారు. కార్యక్రమంలో సర్వే శాఖ సహాయ సంచాలకులు, ఏర్పేడు తహసీల్దార్, జిల్లా తనిఖీ అధికారులు, మండల సర్వేయర్, వీఆర్వో, ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య అధ్యాపకులకు మూడు రోజుల నిరంతర వైద్య విద్య కార్యక్రమం

ఎస్వీ వైద్య కళాశాలలో కార్యక్రమం ప్రారంభం

వైద్య రంగంలో మార్పులకు అనుగుణంగా నైపుణ్యాలు పెంచుకోవాలి

పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయాలి



తిరుపతి, అక్టోబర్ 7: (మహా న్యూస్) ఎస్వీ వైద్య కళాశాలలో వైద్య అధ్యాపకులకు మూడు రోజుల నిరంతర వైద్య విద్య కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవి ప్రభు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. సీఎంసీ వెల్లూరు సౌజన్యంతో ఆరో నిరంతర వైద్య విద్య కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డాక్టర్ రవి ప్రభు తెలిపారు. జాతీయ వైద్య మండలి ఆదేశాల మేరకు కార్యక్రమానికి సమన్వయకర్తగా డాక్టర్ శ్రీహరి రావును నియమించినట్లు పేర్కొన్నారు. వైద్య రంగంలో ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులను అధ్యాపకులు గమనిస్తూ తమ నైపుణ్యాలను పెంచుకోవాలని డాక్టర్ రవి ప్రభు సూచించారు. తద్వారా పేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు వైద్య విద్యార్థులకు నాణ్యమైన వైద్య విద్య అందించవచ్చని తెలిపారు. రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి. మనోహర్ మాట్లాడుతూ వైద్య రంగంలో కొత్తగా వస్తున్న మార్పులు, ఆధునిక వైద్య విధానాలపై విద్యార్థులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు. దీనివల్ల రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నిరంతర వైద్య విద్య నోడల్ అధికారి డాక్టర్ ఏఎస్ కిరీటి, ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రమీల దేవి, డాక్టర్ సిరిగిరి సునీత, వైద్యులు, వైద్య అధ్యాపకులు, పీజీ వైద్య విద్యార్థులు, ఫ్యాకల్టీ, ఎంఈయూ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై విస్తృత అవగాహన





చిత్తూరు, అక్టోబర్ 7: (మహా న్యూస్) బాల్య వివాహాల నిర్మూలనపై గ్రామస్థాయి నుంచి విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం జెడ్పీ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామస్థాయి బాల్య వివాహ నిషేధ కమిటీలు క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని, ఎస్‌హెచ్‌జీలు, గ్రామసభలు, పాఠశాలలు, జూనియర్ కళాశాలల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలలకు దూరమైన పిల్లలను గుర్తించి తిరిగి చేర్పించాలన్నారు. విద్యాసంస్థలు, ప్రముఖ ప్రదేశాల్లో బాల్య వివాహ నిరోధక చట్టం, పోక్సో చట్టం, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098పై ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, 11 ఐసీడీఎస్ ప్రాజెక్టుల సీడీపీఓలు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ పార్క్ భూ లభ్యత పనులు వేగవంతం చేయాలి

కోసలనగరం వద్ద 1,541.41 ఎకరాల ప్రభుత్వ భూమి

అప్రోచ్ రోడ్డు భూసేకరణ వేగవంతం చేయాలి

రోడ్డు కనెక్టివిటీపై ప్రత్యేక దృష్టి



నగిరి, అక్టోబర్ 7: (మహా న్యూస్) విజయపురం మండలం కోసలనగరం సమీపంలో ప్రతిపాదిత ఇండస్ట్రియల్ పార్క్ కోసం భూ లభ్యత, అప్రోచ్ రోడ్డు భూసేకరణ పనులను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రతిపాదిత పారిశ్రామిక పార్కు ప్రాంతాన్ని పరిశీలించిన ఆయన, ఎన్‌హెచ్-716 నుంచి పార్కుకు వెళ్లే అప్రోచ్ రోడ్డు, ఏ, బీ, సీ, డీ రోడ్లను పరిశీలించారు. సర్వే నంబర్ 117/2లోని 1,541.41 ఎకరాల ప్రభుత్వ భూమిని ఏపీఐఐసీకి అప్పగించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

హార్టికల్చర్ హబ్‌తో రైతులకు ప్రయోజనం

ఉద్యాన పంటలకు మెరుగైన నీటి వసతులు

మామిడి, అరటి, బొప్పాయి, దానిమ్మ రైతులకు మేలు

హార్టికల్చర్ హబ్‌తో మార్కెటింగ్‌కు ఊతం





చిత్తూరు, అక్టోబర్ 7: (మహా న్యూస్) హార్టికల్చర్ హబ్ ఏర్పాటు, మెరుగైన సాగునీటి వసతులతో ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులకు మరింత ప్రయోజనం కలుగుతుందని రైతులు తెలిపారు. బంగారుపాళెం మండలం మొగిలివారిపల్లికి చెందిన రైతు మోహన్ మాట్లాడుతూ.. పదేళ్లుగా మామిడి సాగు చేస్తున్నామని, పంటకు తగిన ధర లభించడంతో ఇబ్బందులు తగ్గాయని తెలిపారు. మదనపల్లెలో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు రైతులకు ఎంతో ఉపయోగకరమన్నారు. శాంతిపురం మండలానికి చెందిన రైతు రాజారెడ్డి మాట్లాడుతూ.. హంద్రీ--నీవా నీటితో చెరువులు నిండడంతో భూగర్భ జలాలు పెరిగాయని తెలిపారు. దీంతో అరటి, బొప్పాయి, దానిమ్మతో పాటు ఇతర ఉద్యాన పంటల సాగు పెరిగిందన్నారు.

బాల్య వివాహాలు, టీనేజ్ గర్భధారణల నివారణకు ప్రత్యేక చర్యలు

మూడు నెలల పాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు

గ్రామస్థాయి కమిటీలు అప్రమత్తంగా ఉండాలి

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి







చిత్తూరు, అక్టోబర్ 7: (మహా న్యూస్) జిల్లాలో బాల్య వివాహాలు, టీనేజ్ గర్భధారణలను అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. బుధవారం జెడ్పీ కార్యాలయంలో నిర్వహించిన పోషణ మాసం--2026 కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. బాల్య వివాహాల వల్ల బాలికల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. గ్రామస్థాయిలో సర్పంచ్, అంగన్‌వాడీ, ఆశా, ఏఎన్ఎం, పంచాయతీ సిబ్బంది, ఉపాధ్యాయులతో కూడిన కమిటీలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలో ప్రతి నెలా 400కు పైగా టీనేజ్ గర్భధారణ కేసులు నమోదవుతున్నాయని, ఇది ఆందోళనకరమని తెలిపారు. మూడు నెలల పాటు ప్రతి స్వయం సహాయక సంఘం సమావేశంలో బాల్య వివాహాలు, టీనేజ్ గర్భధారణలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. వైద్య, ఐసీడీఎస్, డీఆర్‌డీఏ, విద్య, పోలీసు శాఖలు కలిసి పనిచేయాలని సూచించారు. ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్ మాట్లాడుతూ పోషకాహారంతో ఆరోగ్యకరమైన బాల్యాన్ని అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. కార్యక్రమంలో అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పోషణ మాసం-2026 కార్యక్రమంలో

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్





చిత్తూరు। అక్టోబర్ 7 (మహిన్యూస్): జడ్పీ కార్యాలయంలోని ఎన్టీఆర్ సమావేశ మందిరంలో నిర్వహించిన పోషణ మాసం--2026 కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, ఐసీడీఎస్ పీడీ ఇన్‌చార్జ్ శ్యామ్ సుగుణకుమారి, డీఈఓ లక్ష్మీనారాయణ, ఎస్ఎస్‌పీఓ వెంకటరమణ, డీఎంహెచ్ఓ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే హామీ.. రెండు రోజుల్లోనే అధికారుల పరిశీలన

లచ్చిపాలెం మంచినీటి చెరువు పునరుద్ధరణకు చర్యలు



తాళ్ళరేవు, మహి న్యూస్, అక్టోబర్ 7: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం లచ్చిపాలెం గ్రామంలోని మంచినీటి చెరువును పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు చేసిన విజ్ఞప్తికి ప్రభుత్వ విప్, ముమ్మిడివరం నియోజకవర్గ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) వెంటనే స్పందించారు. ఇటీవల సుంకరపాలెం గ్రామంలో నిర్వహించిన శ్రీ లక్ష్మీ గణపతి స్వామివారి అన్న సమారాధన కార్యక్రమానికి ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు హాజరైన సమయంలో తాళ్ళరేవు మండలానికి చెందిన పలువురు ప్రజలు ఆయనను కలిసి మంచినీటి చెరువు సమస్యను వివరించారు. చెరువు చాలాకాలంగా వినియోగంలో లేకపోవడంతో రానున్న వేసవిలో గ్రామంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని, చెరువును శుభ్రపరిచి పునరుద్ధరించాలని వినతిపత్రం సమర్పించారు. ప్రజల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే బుచ్చిబాబు.. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. హామీ ఇచ్చిన రెండు రోజుల్లోనే సంబంధిత అధికారులను చెరువు వద్దకు పంపించి పరిస్థితిని పరిశీలించడంతో పాటు, చెరువును శుభ్రపరిచి రానున్న వేసవిలో నీటి ఎద్దడి లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుకీర్తి, తాళ్లరేవు మండల సాగునీటి సంఘం డిస్ట్రిబ్యూటర్ చైర్మన్ వేగిస్న భాస్కర్ రాజు, పెద్దిరెడ్డి రవికుమార్ తదితరులు లచ్చిపాలెం గ్రామానికి చేరుకుని మంచినీటి చెరువును పరిశీలించారు. చెరువు ప్రస్తుత పరిస్థితి, శుభ్రపరిచే పనులు, అవసరమైన మరమ్మతులపై అధికారులతో చర్చించారు. త్వరలోనే చెరువుకు అవసరమైన మరమ్మతులు, శుభ్రపరిచే పనులు చేపట్టి తిరిగి ప్రజల వినియోగంలోకి తీసుకువస్తామని అధికారులు తెలిపారు. ముఖ్యంగా వేసవికాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రజలు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి, చెప్పిన రెండు రోజుల్లోనే అధికారులను పంపించి చెరువు పరిశీలనకు చర్యలు చేపట్టడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట ఇచ్చిన తర్వాత ఆ మాటకు కట్టుబడి పనిచేసే వ్యక్తి అని పలువురు కొనియాడారు. ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు ఆయన చూపుతున్న చొరవ అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో గుంట ముక్కల సూరిబాబు, చిక్కం హనుమంతరావు, సుంకర రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కనకాలపేటలో ఇంట్లో చోరీ

ఐదు కాసుల బంగారం, 200 గ్రాముల వెండి, రూ.2.15 లక్షలు అపహరణ



యానం, మహి న్యూస్, అక్టోబర్ 7: కేంద్రపాలిత ప్రాంతమైన యానం శివారు కనకాలపేట గణపతినగర్‌లో సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. గణపతినగర్‌కు చెందిన కోలా రామకృష్ణ కుటుంబ సభ్యులు వైద్యం నిమిత్తం ఆసుపత్రికి వెళ్లడంతో ఇంటికి తాళం వేసి ఉంది. ఇదే అదునుగా భావించిన దుండగులు తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. ఇంట్లోని సుమారు ఐదు కాసుల బంగారం, 200 గ్రాముల వెండి, రూ.2.15 లక్షల నగదు అపహరించినట్లు బాధితులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసి దుండగుల ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు. గణపతినగర్‌లో వరుసగా చోరీలు జరుగుతుండటంతో స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఇది మూడో దొంగతనం అని స్థానికులు చెబుతున్నారు. రాత్రివేళల్లో పోలీసులు నిరంతరం గస్తీ నిర్వహించాలని వారు కోరుతున్నారు. అదేవిధంగా



స్ట్రీట్ లైట్లు వెయ్యాలని వినతి.

గణపతినగర్‌లో పలు ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు లేకపోవడంతో రాత్రివేళల్లో చీకటి అలుముకుంటోందని, దీంతో బయటకు రావాలన్నా, ఇళ్ల వద్ద ఉండాలన్నా భయాందోళనకు గురవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు పోలీసు గస్తీని పెంచాలని వారు కోరుతున్నారు.

పిల్లారాయ ఆలయంలో ఘనంగా అన్న సమారాధన

15 వేల మందికి పైగా భక్తులకు అన్న ప్రసాద వితరణ





యానం, మహి న్యూస్, అక్టోబర్ 7: కేంద్ర పాలిత ప్రాంతమైన యానంలో సుమారు వందేళ్ల చరిత్ర కలిగిన ప్రసిద్ధ శ్రీ పిల్లారాయ స్వామివారి ఆలయంలో గణపతి నవరాత్రి మహోత్సవాల ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం పిల్లారాయ సేవా సమితి ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అన్న సమారాధన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యానం ప్రాంతీయ పరిపాలన అధికారి శివరాజ్ మీనా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన ఈ అన్న సమారాధనకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచే ఆలయ పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారి దర్శనం అనంతరం భక్తులు అన్న సమారాధనలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సుమారు 15 వేల మంది భక్తులకు అన్న ప్రసాదాన్ని అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సుమారు వంద సంవత్సరాల చరిత్ర కలిగిన పిల్లారాయ స్వామివారి ఆలయంలో ప్రతి ఏడాది గణపతి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని నిర్వాహకులు తెలిపారు. భక్తుల సహకారంతో నవరాత్రి వేడుకలను విజయవంతంగా నిర్వహించామని, ముగింపు సందర్భంగా భారీ అన్న సమారాధన చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లారాయ సేవా సమితి, ప్రెసిడెంట్. కాపగంటి తాజుద్దీన్, వైస్ ప్రెసిడెంట్ నల్లా రాము, సెక్రటరీ పోలిశెట్టి చిట్టినాయుడు, జాయింట్ సెక్రటరీ యర్రంశెట్టి రామ్ కుమార్, ట్రెజరర్ కంచెర్లపల్లి రవి, జాయింట్ ట్రెజరర్ నిదవోలు నాగేంద్రబాబు, అల్లూరి నాగేశ్వరావు,శ్రీను,సానా శ్రీను తదితరులు పాల్గొన్నారు. అలాగే వర్తక సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, సేవా సమితి ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్న సమారాధన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సేవా సమితి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. గణపతి నవరాత్రి ముగింపు సందర్భంగా నిర్వహించిన ఈ భారీ అన్న సమారాధన భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా ముగిసింది.

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక

తల్లి, బిడ్డల ఆరోగ్యానికి పోషకాహారం కీలకం



కర్నూలు, అక్టోబర్ 7: (మహి న్యూస్): తల్లి, బిడ్డల ఆరోగ్యానికి పోషకాహారం ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అన్నారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన పోషణ మాసం--2026 జిల్లా స్థాయి కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు. చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించి, పోషకాహార





స్టాళ్లను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. గుడ్లు, పాలు, పప్పులు, శనగలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలు వంటి పోషకాహారాన్ని తీసుకోవాలని, ఆరు నెలల తర్వాత పిల్లలకు వయస్సుకు అనుగుణంగా అదనపు ఆహారం అందించాలని తెలిపారు. అంగన్వాడీల్లో పిల్లల ఎదుగుదల, ఆహారం, ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పోషకాహారాన్ని పిల్లలకు సక్రమంగా అందేలా తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. అనంతరం జిల్లాలోని 9 ప్రాజెక్టుల పరిధిలో ఎంపికైన 9 మంది పోషణ్ ఛాంపియన్ తల్లులను సన్మానించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.”

22-ఏ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

15 రోజులకు మించి పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి
ఫేజ్-6 గ్రౌండ్ ట్రూథింగ్ పనులు డిసెంబర్‌లోగా పూర్తి చేయాలి
హౌస్‌సైట్స్ దరఖాస్తుల పరిష్కారానికి వేగం పెంచాలి
ఈ-ఆఫీస్ పెండింగ్ ప్రక్రియ శుక్రవారం లోగా పూర్తి చేయాలి



కర్నూలు, అక్టోబర్ 7: (మహి న్యూస్): 22-ఏ భూములకు సంబంధించి 15 రోజులకు మించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ఆర్డీఓలు, తహసీల్దార్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సమీక్షలో పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రీ సర్వే ఫేజ్--4, ఫేజ్--5లో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఫేజ్--6లో 44 గ్రామాల్లో జరుగుతున్న గ్రౌండ్ ట్రూథింగ్ పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. కర్నూలు అర్బన్, కల్లూరు, ఎమ్మిగనూరు అర్బన్, ఆదోని అర్బన్‌లో పెండింగ్‌లో ఉన్న హౌస్‌సైట్స్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులు, కేటాయించిన స్థలాలు, నిర్మాణాల వివరాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ-ఆఫీస్‌కు సంబంధించిన మెయిల్ ఐడీలు, సిబ్బంది మ్యాపింగ్, డిజిటల్ కీ తదితర ప్రక్రియలను శుక్రవారం లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. 22-ఏ కేసుల పరిష్కారంలో పారదర్శకత పాటించాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ సూచించారు. సమీక్షలో డీఆర్ఓ సి. వెంకట నారాయణమ్మ, ఆర్డీఓలు, సర్వే అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు అభివృద్ధికి పెద్దపీట

లొద్దిపల్లెలో రూ.30 లక్షలతో తాగునీటి పనులకు శ్రీకారం
ఉయ్యాలవాడలో రూ.1.03 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులకు భూమిపూజ
రూ.70 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి
రూ.30.30 లక్షలతో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ప్రారంభం
మరిన్ని నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



ఓర్వకల్లు, అక్టోబర్ 7: (మహి న్యూస్): పాణ్యం నియోజకవర్గంలోని ఓర్వకల్లు మండలం లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి తెలిపారు. టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్‌తో కలిసి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, భూమిపూజలు నిర్వహించారు. లొద్దిపల్లెలో జల జీవన్ మిషన్--2.0 కింద రూ.30 లక్షలతో నూతన బోరు, పైపులైన్ పనులకు శ్రీకారం చుట్టారు. ఉయ్యాలవాడలో లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి టీటీడీ నిధులు రూ.1.03 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్ల పనులకు భూమిపూజ చేశారు. పల్లె పండుగ--1, 2, ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ.70 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అలాగే రూ.30.30 లక్షలతో నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను ప్రారంభించి, పల్లె పండుగ--3 కింద మరో రూ.20 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల పనులకు భూమిపూజ చేశారు. ఉప్పలపాడులోనూ అవసరమైన మౌలిక వసతుల పనులను దశలవారీగా చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మూడు గ్రామాల సమగ్ర అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకొచ్చి పనులను కొనసాగిస్తామని గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

19 ఉద్యానవనాల అభివృద్ధికి రూ.1.94 కోట్లు

తుది దశకు చేరుకున్న అభివృద్ధి పనులు
నాణ్యతా ప్రమాణాలతో గడువులోగా పూర్తి చేయాలని ఆదేశం







కర్నూలు, అక్టోబర్ 7: (మహి న్యూస్): నగర ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు ఉద్యానవనాల అభివృద్ధి పనులను వేగవంతం చేశామని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. రూ.1.94 కోట్లతో 19 ఉద్యానవనాల్లో చేపట్టిన పనులు తుది దశకు చేరుకున్నాయని పేర్కొన్నారు. బుధవారం వీనస్ కాలనీలోని జెండా పార్కులో జరుగుతున్న పనులను పరిశీలించిన కమిషనర్.. గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వెంకటరమణ కాలనీలోని జీటీఎస్ స్టేషన్, బళ్లారి చౌరస్తాలోని అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంహెఓ గిరిరాజ్, డీఈ కృష్ణలత, టీపీఈఓ రాంమోహన్, శానిటరీ ఇన్స్పెక్టర్లు మునిస్వామి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

దేవరగట్టు బన్ని ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలి
సీసీ కెమెరాలతో నిరంతర నిఘా, పటిష్ట బందోబస్తు
వైద్య, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి
అక్రమ మద్యం, అవాంఛనీయ ఘటనల నియంత్రణకు కఠిన చర్యలు





కర్నూలు, అక్టోబర్ 7: (మహి న్యూస్): దేవరగట్టు బన్ని ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఉత్సవాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉత్సవ ప్రాంతం, ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రధాన మార్గాల్లో రోడ్ల మరమ్మతులు, తగినంత లైటింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా, అగ్నిమాపక వాహనాలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. దేవరగట్టులో అత్యవసర వైద్య సేవల కోసం 30 పడకల ఆసుపత్రి, అంబులెన్సులు, స్ట్రెచర్లు, వీల్‌చైర్లు, మందులు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. అక్రమ మద్యం రవాణా, నిల్వలు, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ బ్లాక్ స్పాట్ ప్రాంతాల్లో అదనపు లైటింగ్ ఏర్పాటు చేయాలని, ఇరుకైన మార్గాల్లో అత్యవసర సేవలకు చిన్న అగ్నిమాపక వాహనాలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఇనుప రింగులు అమర్చిన కర్రలను ముందుగానే గుర్తించి స్వాధీనం చేసుకోవాలని, దివిటీలు విసరడం వంటి ప్రమాదకర చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉత్సవ ప్రాంతం మొత్తం సీసీ కెమెరాల నిఘాలో ఉంటుందని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. అనంతరం శ్రీ మాళ సహిత మల్లేశ్వర స్వామి దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డీఆర్ఓ వెంకట నారాయణమ్మ, ఆర్డీఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలి

ప్రయోగాత్మక అభ్యసనంతో భవిష్యత్ శాస్త్రవేత్తలుగా ఎదగాలి
అంతరిక్ష సాంకేతికతతో రైతులకు ప్రయోజనాలు
ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో కలెక్టర్ రాజకుమారి





నంద్యాల, అక్టోబర్ 7: (మహి న్యూస్) అంతరిక్ష విజ్ఞానంపై ఆసక్తి పెంచుకొని, ప్రయోగాలు, పరిశోధనల ద్వారా విద్యార్థులు భవిష్యత్ శాస్త్రవేత్తలుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సూచించారు. నంద్యాల ఎస్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇస్రో శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. అంతరిక్ష సాంకేతికత కమ్యూనికేషన్‌తో పాటు వాతావరణ అంచనాలు, విపత్తుల హెచ్చరికలు, పంటల పరిస్థితి, నేల తేమ వంటి అంశాల్లో రైతులకు ఉపయోగపడుతోందని తెలిపారు. విద్యార్థులు శాస్త్రీయ ఆలోచన, సృజనాత్మకత, క్రమశిక్షణతో ముందుకు సాగాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఇస్రో శాస్త్రవేత్తలు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

పోలింగ్ కేంద్రాల వారీగా ఎన్నికల సామాగ్రి సిద్ధం చేయాలి
సీసీ కెమెరాలు, హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలి
విధుల్లో నిర్లక్ష్యం వద్దు





కర్నూలు, అక్టోబర్ 7: (మహి న్యూస్) నగరపాలక సంస్థ సాధారణ ఎన్నికల నిర్వహణకు అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ సమావేశ భవనంలో ఎన్నికల సన్నాహకాలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఎన్నికల సామాగ్రిని సిద్ధం చేసుకోవాలని, హెల్ప్‌డెస్క్, సీసీ కెమెరాలు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు, ఎన్ఓసీ జారీ ప్రక్రియలను పూర్తి చేయాలని సూచించారు. మేయర్ అభ్యర్థికి పింక్, కార్పొరేటర్ అభ్యర్థికి వైట్ బ్యాలెట్ పేపర్లు వినియోగిస్తామని తెలిపారు. షామియానాలు, బారికేడ్లు, భోజన ఏర్పాట్లు పూర్తి చేయాలని, ఎన్నికల విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదని కమిషనర్ స్పష్టం చేశారు.

హోర్డింగుల బకాయిలు వెంటనే చెల్లించాలి

ఏజెన్సీలు బకాయిలు తక్షణం చెల్లించాలి
అనుమతి లేని హోర్డింగులకు ఫీజు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలి
లేకుంటే హోర్డింగులు తొలగిస్తాం: కమిషనర్





కర్నూలు, అక్టోబర్ 7: (మహి న్యూస్) నగరంలోని హోర్డింగుల ఏజెన్సీలు నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు. బుధవారం హోర్డింగుల ఏజెన్సీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ.. అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన హోర్డింగులకు ఫీజు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. బకాయిలు చెల్లించకపోతే అనధికార హోర్డింగులుగా పరిగణించి తొలగిస్తామని హెచ్చరించారు. కార్పొరేషన్ ఆదాయానికి నష్టం కలిగించే చర్యలను సహించబోమని స్పష్టం చేశారు.

ఓర్వకల్లు మండలంలో తాగునీటి పనులకు శ్రీకారం

కాల్వలో రూ.1.11 కోట్లతో ఓహెచ్ఆర్ ట్యాంకు ప్రారంభం
ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్ కార్యక్రమానికి శ్రీకారం
కాల్వబుగ్గలో రూ.44 లక్షల ఓహెచ్ఆర్ ట్యాంకుకు భూమిపూజ








ఓర్వకల్లు, అక్టోబర్ 7: (మహి న్యూస్) కాల్వ, కాల్వబుగ్గ గ్రామాల్లో తాగునీటి పనులకు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ బుధవారం శ్రీకారం చుట్టారు. కాల్వలో జలజీవన్ మిషన్ 2.0 కింద రూ.1.11 కోట్లతో నిర్మించిన ఓహెచ్ఆర్ ట్యాంకును ప్రారంభించారు. ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్ కల్పించే కార్యక్రమాన్ని కూడా ప్రారంభించారు. కాల్వబుగ్గలో రూ.44 లక్షలతో నిర్మించనున్న ఓహెచ్ఆర్ ట్యాంకుకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. గ్రామాల్లో తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

వేదవతి, సుద్దవాగు, హంద్రీ-కేసీ కెనాల్ పనులు వేగవంతం

వేదవతి ప్రాజెక్టు భూసేకరణ, నిర్మాణ పనులకు వేగం పెంచాలి
సుద్దవాగు వరద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి
రోడ్లు, హెల్త్ క్లినిక్స్, ఇళ్ల నిర్మాణాలు గడువులోగా పూర్తి చేయాలి





కర్నూలు, అక్టోబర్ 7: (మహి న్యూస్) జిల్లాలో చేపడుతున్న ఇరిగేషన్, పంచాయతీరాజ్, హౌసింగ్, ఎంఎస్ఎంఈ పార్కుల పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి అధికారులను ఆదేశించారు. వేదవతి ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, నిర్మాణ పనులను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లాలన్నారు. కర్నూలు నగరంలోని సుద్దవాగు వరద సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. హంద్రీ, కేసీ కెనాల్ ప్రాంతాల్లో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సహకారంతో పరిశుభ్రత పనులకు ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. హెల్త్ క్లినిక్స్, రోడ్ల పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, పూర్తయిన భవనాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. హౌసింగ్ పనుల్లో గ్రౌండింగ్ శాతం 47 శాతంగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. ఎంఎస్ఎంఈ పార్కుల్లో రోడ్లు, డ్రైన్లు, విద్యుత్, నీటి వసతుల పనులను వచ్చే నాలుగు నెలల్లో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

లక్ష్య సాధనకు విద్యార్థులు క్రమశిక్షణతో కృషి చేయాలి

పదో తరగతి విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
వసతి గృహంలో మెనూ ప్రకారం భోజనం అందించాలి
విద్యార్థినుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి





కర్నూలు, అక్టోబర్ 7: (మహి న్యూస్) విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి సూచించారు. కలెక్టరేట్ సమీపంలోని బీసీ సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాన్ని బుధవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం, వసతి సౌకర్యాలు, సమస్యలపై ఆరా తీశారు. నీటి నిల్వకు ఇబ్బంది ఉందని విద్యార్థినులు తెలపడంతో అదనపు మున్సిపల్ వాటర్ కనెక్షన్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి మంచి మార్కులు సాధించాలని, సమయపాలన, క్రమశిక్షణ అలవర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. పేదరికం చదువుకు అడ్డంకి కాదని, విద్య ద్వారా ఉన్నత అవకాశాలు సాధించి కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుకోవచ్చన్నారు. బాలికలు ఉన్నత విద్య కొనసాగించి తమ కాళ్లపై తాము నిలబడాలని సూచించారు. అనంతరం వంటగదిని పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని వంట సిబ్బందిని, అధికారులను ఆదేశించారు.

మీడియేషన్‌తో కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై అవగాహన
మీడియేషన్‌తో కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవచ్చు
కక్షిదారులను మధ్యవర్తిత్వం వైపు ప్రోత్సహించాలి





కర్నూలు, అక్టోబర్ 7: (మహి న్యూస్) కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను మధ్యవర్తిత్వం ద్వారా త్వరితగతిన పరిష్కరించేందుకు న్యాయవాదులు కృషి చేయాలని మీడియేషన్ రీసోర్స్ పర్సన్ ఆర్. విజయ కమల సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు కర్నూలు బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులకు మీడియేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి, చెన్నై నుంచి వచ్చిన విజయ కమల కార్యక్రమంలో పాల్గొన్నారు. మీడియేషన్ వల్ల కలిగే ప్రయోజనాలు, నిబంధనలు, రెగ్యులేషన్లు, చట్టం గురించి న్యాయవాదులకు వివరించారు. తమ కక్షిదారులను మధ్యవర్తిత్వం వైపు ప్రోత్సహించి, సాధ్యమైనన్ని ఎక్కువ కేసులను మీడియేషన్ ద్వారా పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రుడు, కార్యదర్శి మహేశ్వర రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను మధ్యవర్తిత్వంతో పరిష్కరించాలి

న్యాయమూర్తులకు మధ్యవర్తిత్వంపై అవగాహన
కర్నూలు హెడ్‌క్వార్టర్ న్యాయమూర్తులకు ప్రత్యక్ష శిక్షణ
నంద్యాల, కర్నూలు జిల్లాల న్యాయమూర్తులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన



కర్నూలు, అక్టోబర్ 7: (మహి న్యూస్) కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలని మధ్యవర్తిత్వ రిసోర్స్ పర్సన్ ఆర్. విజయ కమల సూచించారు. సుప్రీంకోర్టు మధ్యవర్తిత్వ విభాగం ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా ఆరవ అదనపు జిల్లా జడ్జి, ఫుల్ అడిషనల్ ఛార్జ్ ప్రధాన న్యాయమూర్తి పి. వాసు ఆధ్వర్యంలో న్యాయమూర్తులకు మధ్యవర్తిత్వంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కర్నూలు హెడ్‌క్వార్టర్ న్యాయమూర్తులకు ప్రత్యక్షంగా, కర్నూలు, నంద్యాల జిల్లాల న్యాయమూర్తులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. వాసు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి పాల్గొన్నారు.

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
మహా న్యూస్
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక

ప్రత్యేక అవసరాల విద్యార్థులకు ఉచితంగా విద్యా ఉపకరణాల పంపిణీ



కడప జిల్లా/జమ్మలమడుగు, అక్టోబర్ 7, (మహా న్యూస్): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉన్న భవిత కేంద్రంలో సమగ్ర శిక్ష విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు, దివ్యాంగులకు విద్యా ఉపకరణాల ఉచిత పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి పాల్గొని విద్యార్థులకు విద్యా ఉపకరణాలను పంపిణీ చేశారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు రమణారెడ్డితో పాటు ఎంఈఓలు రమేష్, చంద్రశేఖరరావు, బాల పుల్లారెడ్డి, జీకే గైబు, జనార్దన్‌రెడ్డి, హర్షద్, అనంత నాయుడు, నవీన్ రాయల్, నాగూర్, ఐఈఆర్‌పీలు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన

- డిఎఫ్ఓ కె. బాలరాజు



కడప, మహి న్యూస్ అక్టోబర్ 7: వైఎస్సార్ కడప జిల్లా అటవీ శాఖ అధికారిగా నూతనంగా నియమితులైన కె. బాలరాజు, ఐఎఫ్ఎస్ బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు మొక్కను అందజేశారు. గిద్దలూరు సబ్ డివిజన్ నుంచి బదిలీపై వైఎస్సార్ కడప జిల్లా అటవీ శాఖ అధికారిగా కె. బాలరాజు నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

హెచ్‌పీవీ టీకాలో కడప జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానం



కడప, అక్టోబర్ 7 (మహి న్యూస్): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పర్యవేక్షక సిబ్బంది నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ నెలలో చేపట్టిన వైద్య ఆరోగ్య కార్యక్రమాల ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ 14 ఏళ్ల బాలికలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ కోసం అందించే హెచ్‌పీవీ టీకాల కార్యక్రమంలో కడప జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. ఇదే తరహా ప్రగతిని అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో సాధించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సిబ్బందితో కలిసి పనిచేస్తూ సేవల నాణ్యతను పర్యవేక్షించాలని, మాతా శిశు మరణాల నివారణకు నిరంతర సేవలు అందించాలని తెలిపారు.



వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని 100 శాతం అమలు చేసి 12 రకాల వ్యాధుల నుంచి పిల్లలను రక్షించాలని సూచించారు. టీకాల వివరాలను కార్యక్రమం పూర్తయిన వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, గర్భిణులకు అందించే మాతా శిశు సంరక్షణ కార్డులో అన్ని సేవల వివరాలను నమోదు చేయాలని చెప్పారు. పిల్లలకు ఐరన్ సిరప్‌ను వారానికి రెండు పర్యాయాలు అందించాలని, కుష్ఠు వ్యాధి కేసుల ఇంటింటి సర్వేను ఈ నెల 9వ తేదీలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో పక్కా ప్రణాళికతో ప్రగతి సాధించాలని, ఇకపై కార్యక్రమాల సమీక్ష సూచికల వారీగా ఉంటుందని తెలిపారు. అధికారులు, సిబ్బంది సమష్టిగా పనిచేసి కడప జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. సమావేశంలో జిల్లా టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్, జిల్లా గణాంక అధికారి రమేష్ రెడ్డి, ఫిజియోథెరపిస్ట్ మనోహర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ప్రభుత్వం ముందుకు

కూటమి ప్రభుత్వ లక్ష్యం ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు

టీడీపీ జిల్లా అధ్యక్షులు భూపేష్ రెడ్డి



కడపజిల్లా /జమ్మలమడుగు అక్టోబర్ 7, (మహి న్యూస్): రాష్ట్రంలోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని టీడీపీ జిల్లా అధ్యక్షులు భూపేష్ రెడ్డి అన్నారు. అమరజీవి జలధార సభ విజయవంతం కావడం సంతోషకరమని తెలిపారు. రాష్ట్రంలో అమరజీవి జలధార కార్యక్రమం ద్వారా సుమారు రూ.30 వేల కోట్ల విలువైన పనులకు శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. సభ విజయవంతం కావడాన్ని జీర్ణించుకోలేక వైకాపా నాయకులు విమర్శలు చేయడం సరికాదని పేర్కొన్నారు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందని భూపేష్ రెడ్డి విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతుంటే వైకాపా నాయకులు ఓర్వలేక విమర్శలు చేయడం వారి చేతకానితనానికి నిదర్శనమన్నారు. కడప జిల్లా నుంచి ఇద్దరు ముఖ్యమంత్రులు పనిచేసినప్పటికీ ప్రజలకు తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదని విమర్శించారు. చేయని పనులను చేసినట్లుగా చెప్పుకోవడం వైకాపా నాయకులకే చెల్లిందన్నారు. మిషన్ రాయలసీమ ద్వారా రాయలసీమ సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించి ముందుకు సాగుతోందని తెలిపారు. కొప్పర్తి, ఓర్వకల్లు ప్రత్యేక ఆర్థిక మండళ్ల అభివృద్ధితో పారిశ్రామిక రంగానికి మరింత ఊతం లభిస్తుందని చెప్పారు. రాయలసీమలో సుమారు రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో ఉద్యానవన రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కడప జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని భూపేష్ రెడ్డి తెలిపారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి కూటమి ప్రభుత్వం ప్రజల కోసం ముందుకు సాగుతోందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఆధ్వర్యంలో సమష్టిగా పనిచేసి విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు జయసుబ్బారెడ్డి, బొమ్మిశెట్టి చంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి జబీవుల్లా, అధికార ప్రతినిధి మన్నూర్ అక్బర్, మీడియా సమన్వయకర్త జనార్దన్, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కడప ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం

- ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. జె. వెంకట లక్ష్మి



కడప మహి న్యూస్ , అక్టోబర్ 07: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబించాలని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, కడప ప్రిన్సిపాల్ డా. జె. వెంకట లక్ష్మి సూచించారు. జిల్లా పోలీస్ శాఖ కళాజాతా బృందం ఆధ్వర్యంలో



కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులకు మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జిల్లా ఈగిల్ క్లబ్ కన్వీనర్ ఆయుఖాన్ ఆధ్వర్యం వహించగా, ఎస్సై సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల ఈగిల్ క్లబ్ కన్వీనర్ డా. పి.వి. కృష్ణారెడ్డి సమన్వయంతో కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పోలీస్ శాఖ కళాజాతా బృందం స్కిట్ ద్వారా మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలను వివరించింది. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబ జీవితం, విద్య, ఉద్యోగ అవకాశాలు, భవిష్యత్తుపై చూపే ప్రతికూల ప్రభావాలను విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తి జీవితం, కుటుంబ సంబంధాలు ఎలా దెబ్బతింటాయో కళాజాతా బృందం ప్రదర్శన ద్వారా వివరించింది. ప్రిన్సిపాల్ డా. జె. వెంకట లక్ష్మి మాట్లాడుతూ, విద్యార్థులు దేశ భవిష్యత్తుకు పునాదులని, దేశ శీల నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండటంతో పాటు, పరిసరాల్లో మాదక ద్రవ్యాల వినియోగం లేదా అక్రమ కార్యకలాపాలు గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఎస్సై సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, సోషల్ మీడియా ప్రభావం, చెడు స్నేహాలు తదితర కారణాలతో కొంతమంది యువత గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, విక్రయం వంటి నేరాలకు పాల్పడేవారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు సమస్యలు ఎదురైతే పోలీస్ శాఖను సంప్రదించాలని సూచించారు. మాదక ద్రవ్యాల అక్రమ ఉత్పత్తి, రవాణా, విక్రయం, నిల్వ, వినియోగానికి చట్టపరమైన శిక్షలు ఉంటాయని అధికారులు వివరించారు. యువతను వ్యసనాల నుంచి రక్షించేందుకు విద్యాసంస్థల్లో నిరంతర అవగాహనా కార్యక్రమాలు అవసరమని డా. పి.వి. కృష్ణారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈగిల్ క్లబ్ సభ్యులు, పోలీస్ అధికారులు, కళాజాతా బృందం, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. "డ్రగ్స్‌కు నో చెప్పండి -- ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించుకోండి" అనే సందేశాన్ని కార్యక్రమం ద్వారా అందించారు.

పోషణతోనే ఆరోగ్యకరమైన తరానికి బలమైన పునాది...!

జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

పోషకాహార లోపం లేని జిల్లాగా కడపను తీర్చిదిద్దడమే లక్ష్యం

'మన అంగన్‌వాడీ-మన బాధ్యత'తో పోషణ మాసం విజయవంతం

అంగన్‌వాడీల బలోపేతానికి సమాజ భాగస్వామ్యం అవసరం



కడప, మహి న్యూస్ అక్టోబర్ 07 : జిల్లాలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమ శాఖల క్షేత్రస్థాయి సిబ్బంది గత కొన్నేళ్లుగా చేస్తున్న సమష్టి కృషి వల్ల ఆరోగ్యం, పోషణకు సంబంధించిన సూచీల్లో గణనీయమైన పురోగతి సాధ్యమైందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి వివరించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 9వ జాతీయ పోషణ మాసం--2026 జిల్లా స్థాయి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ డా.



శ్రీధర్ చెరుకూరి తోపాటు జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో పోషణ మాసం విజయవంతంగా కొనసాగడానికి చేపట్టిన చర్యలను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు నెల రోజుల పాటు నిర్వహిస్తున్న "పోషణ మాసం" కేవలం ప్రభుత్వ శాఖల కార్యక్రమంగా కాకుండా ప్రజలందరి భాగస్వామ్యంతో నిర్వహించాల్సిన సామాజిక ఉద్యమంగా భావించాలన్నారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు సమతుల్యమైన పోషకాహారం అందించడం, రక్తహీనతను తగ్గించడం, తల్లులు, పిల్లల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచడం, బాలల సమగ్ర వికాసానికి అవసరమైన వాతావరణం కల్పించడం వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో చేపట్టిన నిరంతర చర్యలు అభినందనీయం అన్నారు. ఆకాంక్ష జిల్లా, ఆకాంక్ష మండల కార్యక్రమాల్లో ఆరోగ్యం, పోషణ అంశాలకు అత్యంత ప్రాధాన్యం ఉందని, ఈ అంశాల్లో కడప జిల్లా వరుసగా త్రైమాసికాల్లో దేశంలో అగ్రస్థానంలో నిలవడం వెనుక క్షేత్రస్థాయి సిబ్బంది అంకితభావం, పటిష్టమైన అమలు విధానం ప్రధాన కారణమని తెలిపారు. ఈ విజయానికి కృషి చేస్తున్న జిల్లా యంత్రాంగం, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఇతర క్షేత్రస్థాయి సిబ్బందిని అభినందించారు. ఆరోగ్యం, పోషణ రెండు వేర్వేరు అంశాలు కాదని, రెండూ పరస్పరం అనుసంధానమై ఉంటాయని కలెక్టర్ వివరించారు. తల్లి ఆరోగ్యం, శిశువు ఆరోగ్యం, చిన్నారుల ఎదుగుదలతో పాటు పెద్దల ఆరోగ్యానికి కూడా సమతుల్యమైన, సంపూర్ణమైన పోషకాహారమే పునాది అని తెలిపారు. శరీరానికి అవసరమైన ముఖ్యమైన పోషకాల్లో ఏదైనా లోపిస్తే పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలతో పాటు వారి అభివృద్ధిపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సమతుల్యమైన పోషకాహారాన్ని అందించేందుకు ప్రభుత్వం ఇప్పటికే పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేసిందని, అందించే ఆహార నాణ్యత, పంపిణీ, అమలును నిరంతరం పర్యవేక్షించే విధానాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అయితే పోషకాహారం అందించడంతో పాటు కుటుంబాల్లో ఆహారపు అలవాట్లలో మార్పు తీసుకురావడం కూడా అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. పిల్లలకు ఏం తినాలో చెప్పడంతో పాటు ఏం తినకూడదో కూడా స్పష్టంగా తెలియజేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ సూచించారు. ప్రస్తుతం శుద్ధి చేసిన ఆహార పదార్థాలు, అధికంగా తయారీ ప్రక్రియకు గురైన చిరుతిళ్లు, శీతల పానీయాలు, బిస్కెట్లు, చాక్లెట్లు తదితరాలకు చిన్నారులు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. ఆకర్షణీయమైన రుచి, రూపం, ప్యాకింగ్‌తో మార్కెట్లోకి వస్తున్న ఇలాంటి పదార్థాల్లో సహజమైన పోషక విలువలు తక్కువగా ఉండే అవకాశం ఉందని, అధిక తయారీ ప్రక్రియ కారణంగా పీచు వంటి ముఖ్యమైన పోషకాలు తగ్గే అవకాశం ఉందని వివరించారు. అందువల్ల పిల్లలకు ఇటువంటి ఆహార పదార్థాల వినియోగాన్ని తగ్గించి సహజమైన, స్థానికంగా లభించే పోషకాహారాన్ని అలవాటు చేయాలని సూచించారు. మంచి ఆహారపు అలవాట్లను చిన్న వయస్సు నుంచే పిల్లలకు నేర్పించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా రెండు నుంచి ఐదేళ్ల వయస్సు వరకు పిల్లలకు ఆటలు, కథలు, మాటలు, బొమ్మలు వంటి సులభమైన పద్ధతుల ద్వారా ఆరోగ్యకరమైన ఆహారం, అనారోగ్యకరమైన ఆహారం మధ్య తేడాను వివరించాలని సూచించారు. చిన్న వయస్సులో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు చెప్పే విషయాలు పిల్లల మనసుల్లో బలంగా నాటుకుపోతాయని, అందువల్ల ఈ దశలో కల్పించే అవగాహన వారి జీవితాంతం ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. స్థానికంగా తక్కువ ఖర్చుతో లభించే పోషకాహారాన్ని కుటుంబాలు ఎక్కువగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా బొప్పాయి తక్కువ ఖర్చుతో విటమిన్ 'ఎ', 'సి' వంటి ముఖ్యమైన పోషకాలను అందించే మంచి పండు అని, ఇలాంటి స్థానికంగా లభించే పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పప్పుధాన్యాలు తదితరాలను రోజువారీ ఆహారంలో భాగం చేయాలని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు దక్షిణ భారతదేశంలో బియ్యం ఆధారిత ఆహారం ఎక్కువగా తీసుకునే అలవాటు ఉందని, ఫలితంగా ఆహారంలో కార్బోహైడ్రేట్ల శాతం అధికంగా ఉండే అవకాశం ఉందని కలెక్టర్ వివరించారు. బియ్యం ద్వారా శరీరానికి అవసరమైన శక్తి లభించినప్పటికీ, కేవలం శక్తిని అందించే ఆహారంతో సంపూర్ణ పోషణ సాధ్యం కాదని తెలిపారు. ముఖ్యంగా పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు శరీర నిర్మాణం, ఎదుగుదల కోసం ప్రోటీన్ తగిన మోతాదులో అందాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా చిన్నారుల మెదడు అభివృద్ధికి అవసరమైన ఆరోగ్యకరమైన కొవ్వు పదార్థాలు, ఒమేగా కొవ్వు ఆమ్లాలు కూడా తగిన మోతాదులో లభించేలా ఆహారంలో వైవిధ్యం ఉండాలని సూచించారు. అన్నంతో పాటు కొద్దిపాటి కూర లేదా పప్పుతో భోజనం పూర్తయిందని భావించకుండా ధాన్యాలు, పప్పులు, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, గుడ్లు, పాలు తదితర పోషక పదార్థాలను సమతుల్యంగా ఆహారంలో చేర్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా పిల్లల ఆహారంలో ప్రోటీన్, విటమిన్లు, ఖనిజ లవణాలు, ఆరోగ్యకరమైన కొవ్వు పదార్థాలు తగిన మోతాదులో ఉండేలా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. పిల్లల జీవితంలో తొలి రెండేళ్లు మెదడు అభివృద్ధికి అత్యంత కీలకమైన దశ అని కలెక్టర్ వివరించారు. పుట్టిన తర్వాత తొలి 15--18 నెలల్లో మెదడు అభివృద్ధి వేగంగా జరుగుతుందని, ఐదేళ్ల వరకు కూడా ఈ అభివృద్ధి కొనసాగుతుందని తెలిపారు. ఈ దశలో అవసరమైన పోషకాలు సరైన మోతాదులో అందకపోతే పిల్లల శారీరక, మానసిక, మేధో వికాసంపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసి, ప్రతి చిన్నారికి మెరుగైన పోషకాహారం, ఆరోగ్యం, ప్రాథమిక విద్య, సురక్షిత వాతావరణం అందించడంతో పాటు పోషకాహార లోపం లేని, ఆరోగ్యకరమైన తరాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అన్నారు. జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా మాట్లాడుతూ... "మన అంగన్‌వాడీ--మన బాధ్యత" అనే భావనను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి కేవలం మహిళా, శిశు సంక్షేమ శాఖ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి శాఖ, ప్రజాప్రతినిధి, తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థ, యువజన సంఘాలు భాగస్వామ్యంతో బాలవడులు భవిష్య తరాలకు బాటలు వేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను దత్తత తీసుకుని బొమ్మలు, పుస్తకాలు, అభ్యసన సామగ్రి, ఇతర అవసరమైన సౌకర్యాల కల్పనకు సహకరించేలా ప్రజలను ప్రోత్సహించాలని అన్నారు. అంగన్‌వాడీల అభివృద్ధి, పిల్లల పోషణ, పరిశుభ్రత వంటి అంశాల్లో స్థానిక సమాజం జవాబుదారీతనం తీసుకునే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో అందుబాటులో ఉన్న స్థలాలను ఉపయోగించుకుని పోషణ తోటలను అభివృద్ధి చేయాలని కలెక్టర్ సూచించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు స్థలం, కంచె, నీటి సౌకర్యం కల్పించేందుకు సహకరించాలని చెప్పారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖలు కూరగాయల విత్తనాలు, కూరగాయల కిట్లు, మునగ, బొప్పాయి తదితర మొక్కలను అందించాలని ఆదేశించారు. స్థానికంగా పండించిన ఆకుకూరలు, కూరగాయలు, పండ్లను పిల్లల పోషణకు ఉపయోగించుకునే విధంగా కుటుంబాలను కూడా ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో కనీసం ఒక సమన్వయ సమావేశం, ఒక సామూహిక భోజన రుచి పరీక్ష, ఒక పోషక వంటకాల ప్రదర్శన, ఒక పోషణ మేళా, ఒక ప్రధానమంత్రి మాతృ వందన యోజన ప్రత్యేక నమోదు శిబిరం నిర్వహించడం తప్పనిసరి అని కలెక్టర్ స్పష్టం చేశారు. డిఎంహెచ్ఓ యుగంధర్ మాట్లాడుతూ... పోషణ మాసం సందర్భంగా చేపట్టే కార్యక్రమాలు కాగితాలకే పరిమితం కాకుండా ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో, ప్రతి కుటుంబంలో ఆచరణాత్మక మార్పుకు దారితీసేలా అధికారులు, సిబ్బంది పనిచేయాలని సూచించారు. సమష్టి కృషితో జిల్లాను పోషకాహార లోపం లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆరోగ్యశాఖ ఆరోగ్య పరీక్షలు, టీకాలు, రక్తహీనత పరీక్షలు, పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లల గుర్తింపు, అవసరమైన వారికి తదుపరి వైద్య సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. విద్యాశాఖ పాఠశాల సిద్ధత కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు ఉపాధ్యాయులు అంగన్‌వాడీ సమన్వయ సమావేశాల్లో పాల్గొనేలా చూడాలని అన్నారు. ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు, టీకాలు, రక్తహీనత పరీక్షలు నిర్వహించాలని, అవసరమైన పిల్లలను బాలల అభివృద్ధి కేంద్రాలకు పంపించాలని ఆదేశించారు. డీఈవో శంశుద్దీన్ మాట్లాడుతూ... ప్రధానమంత్రి మాతృ వందన యోజన కింద అర్హులైన గర్భిణీలు, బాలింతలకు అందాల్సిన ఆర్థిక సహాయం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, ఇందుకోసం ప్రత్యేక నమోదు శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. గ్రామసభల్లో అంగన్‌వాడీ సేవలపై సమీక్ష నిర్వహించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు కూడా బాధ్యత స్వీకరించాలని కోరారు. స్వయం సహాయక సంఘాలు తల్లులు, గర్భిణీలను పోషణ మేళాలు, పోషక వంటకాల ప్రదర్శనలకు భాగస్వాములను చేయాలని, అంగన్‌వాడీల్లో అందించే భోజనాన్ని పర్యవేక్షించాలన్నారు. పట్టణ స్థానిక సంస్థలు అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలను మెరుగుపరచాలని, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాల సహకారంతో బొమ్మలు, పుస్తకాలు, అభ్యసన సామగ్రి సేకరణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఐసిడిఎస్ పీడి రమాదేవి మాట్లాడుతూ.. పిల్లల భవిష్యత్ ఆలోచనా సామర్థ్యం, నేర్చుకునే సామర్థ్యం, మేధో వికాసం, శారీరక ఎదుగుదలకు తొలి దశలో అందే పోషకాహారం బలమైన పునాది వేస్తుందన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు పిల్లల విద్యాభివృద్ధికి ఎంత ముఖ్యమో, అంతకంటే ముందుగా ఇంట్లో తల్లిదండ్రులు అందించే పోషకాహారం కూడా అంతే ముఖ్యమని తెలిపారు. అందువల్ల తొలి రెండేళ్లలో పిల్లలకు సమతుల్యమైన, సంపూర్ణమైన పోషకాహారం అందించడం ప్రతి తల్లిదండ్రి బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు సీడీపీవోలు, అంగన్వాడీ కార్యకర్తలు, పోషణ్ మాసంలో చేపట్టిన, అంగన్వాడీ కేంద్రాల విశిష్టతను వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంగన్వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాల్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అంగన్ మిలన్ జిల్లా కన్వీనర్ చేపూరి శారదమ్మ, జిల్లా మహిళా, మిషన్ పోషణ్ 2.0 జిల్లా సమన్వయకర్త బి. లవణ్ కుమార్ రెడ్డి, శిశు సంక్షేమ శాఖ అధికారులు, సీడీపీఓలు, పర్యవేక్షకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPA DIST, A.P
PRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com